
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895

# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :83 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు ఆదివారం 02 ఆగస్టు 2026 పేజీలు :12 వేల రూ5 /-

## తెలంగాణ రైజింగ్...
# కొత్త శిఖరాలకు రాష్ట్రం

**సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 1**: తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనం సంబంధిత స్క్రీన్ షాట్‌ను ఎక్స్‌లో షేర్ చేశారాయన. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

**పెట్టుబడులు, ఉపాధితో వేగంగా అభివృద్ధి..**

విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.



## యాంటి పేపర్ లీక్ బిల్లుకు రాష్ట్రపతి
# ఆమోదం

**న్యూఢిల్లీ:**యాంటి పేపర్ లీక్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలు, ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకులు, మాస్ కాపీయింగ్, ఇతర అక్రమాలను అరికట్టే లక్ష్యంతో రూపొందించిన యాంటి పేపర్ లీక్ బిల్లు 2026కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. దీంతో ఈ బిల్లు చట్ట రూపం దాల్చింది. కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ చట్టం ప్రకారం ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల్లో మోసాలు, అక్రమాలకు పాల్పడిన వారికి జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలు కూడా విధించనున్నారు.

# ఉగ్రగోదావరి..
## 3వ ప్రమాద హెచ్చరిక జారీ...



**భద్రచాలం, ఆగస్టు 1**:భద్రాచలం వద్ద గోదావరి నది మహోగ్ర రూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు పోటెత్తడంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. శనివారం ఉదయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 55.1 అడుగులకు చేరడంతో అధికారులు మూడో, చివరి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గురువారం కేవలం 30 అడుగుల వద్ద ఉన్న నీటిమట్టం, కాళేశ్వరం నుంచి వస్తున్న వరద ప్రవాహంతో శుక్రవారం అర్ధరాత్రికి 53 అడుగులకు, శనివారం ఉదయానికి 55.1 అడుగుల ప్రమాదకర స్థాయికి చేరింది. పరిస్థితిని సమీక్షించిన జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్.. లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు సూచించారు.వరద ఉద్ధృతి కారణంగా పర్ణశాల వద్ద స్నానఘట్టాలు పూర్తిగా జలమయమయ్యాయి. సీతవాగు ఉద్ధృతికి సీతమ్మ నార చీరలు, దేవతామూర్తి పీఠంతో పాటు ఇనుప వంతెన కూడా మునిగిపోయాయి. దుమ్ముగూడెం-భద్రాచలం మధ్య శుక్రవారం సాయంత్రం నుంచే రాకపోకలు నిలిచిపోయాయి. తురుబాక ఆర్ అండ్ బీ రహదారిపై నిర్మించిన వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా - మిగతా3లో

## వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా
# జెన్ జీ ఓటర్లు..

**వాట్సాప్ అంకుల్స్?పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు: కేటీఆర్**

**సోషల్ మీడియా వల్లే జవాబుదారీతనం పెరిగిందన్న కేటీఆర్**

**నేటి యువతరం రీల్స్ రూపంలో వార్తలు చూస్తోందని వ్యాఖ్య**



వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం - మిగతా3లో

## అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల
# నిరోధానికి చట్టం తెస్తాం

**: మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్, ఆగస్టు 1**: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్లో సెలక్ట్ కమిటీ సమావేశం ఈరోజు(శనివారం) జరిగింది. సెలక్ట్ కమిటీ చైర్మన్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చించింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఓ నివేదికను సమర్పించే దిశగా ఈ కమిటీ కార్యాచరణ రూపొందించనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు పాల్గొన్నారు. మరోసారి హేట్ బిల్, స్పీచ్ బిల్లు కాపీలను సభ్యులందరికీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ ఇచ్చారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. వారం రోజుల్లో మరోసారి తమ కమిటీ సమావేశం కానుందని తెలిపారు. వచ్చే సమావేశంలో సభ్యులందరీ నుంచి సూచనలను తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి చట్టం తీసుకువస్తామని స్పష్టం చేశారు. శాసనసభలో విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా తమ కమిటీ నివేదిక సిద్ధం చేస్తుందని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలతో పాటు సమాజంలో పేరొందిన వారి సలహాలు తీసుకుంటామని అన్నారు. వ్యక్తుల గౌరవం కాపాడే విధంగా తమ కమిటీ నివేదిక ఉంటుందని వివరించారు. భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## కమలం
# కొత్త వ్యూహం



**హైదరాబాద్ ఆగస్టు 1:**తెలంగాణాలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మార్చింది. కేంద్ర నాయకత్వం తలంటడంతో ఇప్పుడు తెలంగాణ కమలం పార్టీ నేతలు యాక్టివ్ అయ్యారు. సోషల్ మీడియాలో తెలంగాణ నాయకులు వెనకబడి ఉండటాన్ని కేంద్ర నాయకత్వంతో పాటు రాష్ట్ర పార్టీ ఇన్ ఛార్జులు కూడా తప్పుపట్టారు. డిజిటల్ యుగం నడుస్తున్న సమయంలో ఇలా వెనకబడి ఉంటే పార్టీ ఎలా ఎదుగుతుందని ప్రశ్నించారు. ఇకపై రీల్స్ చేయడం, మీమ్స్ వంటి వాటితో ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నించాలని, తెలంగాణలోని ప్రతి ఒక్క బీజేపీ నేతల సోషల్ మీడియాలో యాక్టివ్ కావాలని, వారి ఫాలోయిర్స్ సంఖ్య పెరగాలని ఆదేశాలు జారీచేసింది.తెలంగాణ ప్రభుత్వం. ఇటీవల సోషల్ మీడియా వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవించి ఎన్ని మిలియన్ల మందికి దగ్గరయిందో గుర్తుకు తెచ్చుకోవాలని రాష్ట్ర నేతలకు బీజేపీ కేంద్ర నాయకత్వం క్లాస్ పీకింది. తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల విధానాలపై సోషల్ మీడియా వేదికగా బీజేపీ దూకుడు పెంచింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం, వ్యూహాత్మక పోస్ట్‌లతో ట్రెండింగ్ సృష్టించడం మరియు డిజిటల్ క్యాంపెయిన్ల ద్వారా కేడర్‌లో జోష్ నింపడం వంటి అంశాలపై ఆ పార్టీ ప్రధానంగా దృష్టి సారించింది. ఇందుకోసం ప్రతి నేత సోషల్ మీడియాను హ్యాండిల్ చేసేందుకు సిబ్బందిని - మిగతా3లో

## ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు
# ఆన్‌లైన్ దరఖాస్తులు




**తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్: దరఖాస్తుల తేదీలు ఖరారు**

**తెలంగాణలో 7,437 పోలీస్ పోస్టుల భర్తీకి ప్రకటన**

**పోలీస్, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీల భర్తీ**

**నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసిన టీఎస్ఎల్‌పీఆర్‌బీ**

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) - మిగతా3లో

## మంత్రి
# విస్తరణ లేనట్టే...



**హైదరాబాద్, ఆగస్టు 1:**హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యనేతలు సాగించిన మూడు రోజుల సుదీర్ఘ చర్చలు, ఏఐసీసీ సమన్వయ కమిటీ భేటీల తర్వాత తేలిందేమిటంటే.. ఎంతోమంది సీనియర్లు, ఎమ్మెల్యేలు ఆశగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ ప్రస్తుతానికి కోల్డ్ స్టోరేజీ లోకి వెళ్లిపోయింది. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా సీనియర్లంతా ఢిల్లీ వేదికగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో పలు విడతలుగా సమావేశమైనప్పటికీ, - మిగతా3లో

## కూలిన ప్రాజెక్టుల మరమ్మతులకు
# నిపుణుల నివేదికలకే ప్రాధాన్యం

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

కూలిన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పక్షపాతం లేదని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ నిపుణుల సంస్థలు సమర్పించిన సాంకేతిక నివేదికల ఆధారంగానే మరమ్మతులు చేపడతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మించిన ఆనకట్టలు, ప్రాజెక్టులు ఆరు దశాబ్దాలు పూర్తయినా ఇప్పటికీ దృఢంగా నిలిచి సేవలందిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మూడు ప్రధాన ప్రాజెక్టులు కొద్ది సంవత్సరాలకే దెబ్బతిని, నిర్మాణ నాణ్యతపై తీవ్ర సందేహాలు తలెత్తాయని విమర్శించారు. ప్రజాధనాన్ని కాపాడుతూ, నిపుణుల సూచనలకు అనుగుణంగా దెబ్బతిన్న ప్రాజెక్టులను పునరుద్ధరిస్తామని, ఈ ప్రక్రియలో రాజకీయాలకు తావు ఉండదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

వార్తాతరంగాలు
ఆదివారం 02 ఆగస్టు 2026

# సంపాదకీయం

## ఉద్యోగులలో
# ఎఫర్ట్ రిసెషన్


ముఖ్యంగా యువ ఉద్యోగులు పనిపై తమ దృక్పథాన్ని మార్చుకుంటుండగా, కృత్రిమ మేధస్సు ఉద్యోగ ప్రపంచాన్ని వేగంగా ప్రభావితం చేస్తోంది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా 2026 తాజా అధ్యయనం ప్రకారం భారతీయ సంస్థల్లో 'ఎఫర్ట్ రిసెషన్ అనే కొత్త ధోరణి కనిపిస్తోంది. అంటే ఉద్యోగులు తమ విధుల్లో భాగం కాని అదనపు బాధ్యతలు స్వచ్ఛందంగా తీసుకోవడానికి ఆసక్తి చూపడం తగ్గుతోందని నివేదిక వెల్లడించింది.దేశవ్యాప్తంగా సర్వే చేసిన 380 సంస్థల్లో 240 సంస్థలు (63%), గత ఏడాదితో పోలిస్తే ఉద్యోగుల అదనపు కృషి తగ్గిందని తెలిపాయి. సగటున ఈ తగ్గుదల 5 శాతంగా నమోదైంది. నివేదిక ప్రకారం, ఉద్యోగులు ఎవరూ చెప్పకుండానే ఆలస్యంగా పనిచేయడం, తమ బాధ్యతలకు అతీతంగా సమస్యలను పరిష్కరించడం, స్వచ్ఛందంగా అదనపు బాధ్యతలు స్వీకరించడం వంటి అంశాలనే 'డిస్క్రెషనరీ ఎఫర్ట్'గా నిర్వచించారు. ప్రస్తుతం భారత ఉద్యోగుల్లో జెన్ జీవాటా 26 శాతానికి చేరుకుంది. ఇది 2023తో పోలిస్తే దాదాపు రెండింతలు. ఈ తరం ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేయడం కంటే పని–వ్యక్తిగత జీవితం సమతుల్యత, అనువైన పని విధానం, నిరంతర నైపుణ్యాభివృద్ధి, కెరీర్ పురోగతి, అర్థవంతమైన పని, మానసిక ఆరోగ్యం వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అధ్యయనం పేర్కొంది. అదే సమయంలో ఛా× ప్రభావంతో ఉత్పాదకతను కొలిచే విధానంలో కూడా మార్పులు వస్తున్నాయి. అయితే తాజా నివేదిక ప్రకారం ఉద్యోగుల అదనపు కృషి తగ్గుదల అన్ని రంగాల్లో ఒకేలా ఉండటం లేదు.రిటైల్ రంగంలో 88%, ఐటీ మరియు ప్రొఫెషనల్ సర్వీసెస్‌లో 77%, నిర్మాణం, రియల్ ఎస్టేట్‌లో 71%తయారీ (మాన్యుఫ్యాక్చరింగ్)లో కేవలం 44% తగ్గుదల నమోదైందని తెలిపాయి.ఉద్యోగులు తమ నాయకులు తమ సంక్షేమాన్ని నిజంగా పట్టించుకుంటున్నారని భావిస్తే 99 శాతం మంది అదనపు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటారని అధ్యయనం తెలిపింది. అదే నాయకత్వంపై నమ్మకం లేకపోతే ఈ సంఖ్య 29 శాతానికి పడిపోతోంది. అలాగే నాయకులు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటే 98 శాతం మంది ఉద్యోగులు అదనపు బాధ్యతలు తీసుకుంటారని, అలాంటి నాయకత్వం లేకపోతే ఈ సంఖ్య 32 శాతానికి మాత్రమే పరిమితమవుతుందని నివేదిక వెల్లడించింది.

ఉద్యోగులు తమ నాయకులు తమ సంక్షేమాన్ని నిజంగా పట్టించుకుంటున్నారని భావిస్తే 99 శాతం మంది అదనపు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటారని అధ్యయనం తెలిపింది. అదే నాయకత్వంపై నమ్మకం లేకపోతే ఈ సంఖ్య 29 శాతానికి పడిపోతోంది. అలాగే నాయకులు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటే 98 శాతం మంది ఉద్యోగులు అదనపు బాధ్యతలు తీసుకుంటారని, అలాంటి నాయకత్వం లేకపోతే ఈ సంఖ్య 32 శాతానికి మాత్రమే పరిమితమవుతుందని నివేదిక వెల్లడించింది.

దట్ కల్చర్ థింగ్ సంస్థకు చెందిన ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్ గుర్లీన్ బరువా అభిప్రాయం ప్రకారం ఇది పని పట్ల నిబద్ధత తగ్గిపోవడం కాదని, పనిని చూసే విధానం మారుతున్న సంకేతమని పేర్కొన్నారు. పని పట్ల నిబద్ధత అంటే కేవలం ఎక్కువ గంటలు పనిచేయడం లేదా ఎప్పుడూ బిజీగా కనిపించడం మాత్రమే కాదు. సమస్యలను సమర్థంగా పరిష్కరించడం, నాణ్యమైన ఫలితాలు ఇవ్వడం, బృందంతో సమన్వయంగా పనిచేయడం కూడా నిజమైన వర్క్ ఎథిక్‌లో భాగమే అని ఆమె చెప్పారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఛా× కారణంగా ఉద్యోగాల స్వరూపం మారుతోంది. ముఖ్యంగా ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో గంటల కొద్దీ పనిచేయడం కంటే సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతికతను సమర్థంగా వినియోగించడం కీలకంగా మారుతోంది. అలాగే వర్క్ ఫ్రం హోమ్, హైబ్రిడ్ వర్క్, మానసిక ఆరోగ్యంపై పెరుగుతున్న అవగాహన కారణంగా ఉద్యోగులు తమ వ్యక్తిగత సమయానికి ఎక్కువ విలువ ఇస్తున్నారు. నేటి ఉద్యోగులు అదనపు కృషి చేయడానికి సిద్ధంగానే ఉన్నప్పటికీ, ఆ కృషికి స్పష్టమైన ఉద్దేశం, గుర్తింపు, విశ్వాసం, అర్థవంతమైన పని ఉంటేనే ముందుకు వస్తున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# భారత్ కు జిన్ పింగ్...

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:**2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత్--చైనా సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత దాదాపు ఆరేళ్లపాటు భారత ప్రధాని నరేంద్రమోదీ చైనాకు వెళ్లలేదు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్‌ను సందర్శించలేదు. ఇటీవలే భారత్--చైనా సంబంధాలు మళ్లీ పునరుద్ధరణ జరిగింది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్రమోదీ కొన్ని నెలల క్రితం చైనా పర్యటనకు వెళ్లారు. ఇక ఇప్పుడు సెప్టెంబర్ 12--13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమ్మిట్‌కు జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను మరింత తగ్గించి, కొత్త సంబంధాల పునాది వేసే అవకాశంగా ఉంది.గల్వాన్ ఘర్షణ తర్వాత సరిహద్దు ఉద్రిక్తతలు, సైనిక ఘర్షణలు, వాణిజ్య పరిమితులు వంటివి రెండు దేశాల సంబంధాలను దెబ్బతీశాయి. 2019లో మామల్లపురంలో జరిగిన అనధికారిక సమ్మిట్ తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. అయితే ఇటీవలి కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో కొంత మెరుగుదల కనిపిస్తోంది. 2024లో కజాన్‌లోనూ, 2025లో తియాన్‌జిన్‌లోనూ ప్రధాని మోదీ, జిన్‌పింగ్ కలుసుకున్నారు. సరిహద్దు విషయంలో



కొన్ని అవగాహనలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ రాక భారత్--చైనా సంబంధాల్లో మరో ముఖ్యమైన మలుపుగా మారే అవకాశం ఉంది.భారత్ బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న సందర్భంలో జరుగుతున్న ఈ సమ్మిట్ ప్రపంచ రాజకీయాల్లో కూడా ముఖ్యమైనది. రష్యా, ఇరాన్ వంటి దేశాల నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. పశ్చిమాసియా సంక్షోభం, గ్లోబల్ సౌత్ సమస్యలు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చల్లో ఉంటాయి. జిన్‌పింగ్ హాజరైతే ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. సరిహద్దు సమస్యలు, వాణిజ్య అసమతుల్యత, పెట్టుబడులు వంటి అంశాలపై చర్చ జరగవచ్చు.ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య నమ్మకం పెరిగే అవకాశం ఉంది. వాణిజ్య సంబంధాలు మెరుగుపడటం, సరిహద్దు ఉద్రిక్తతలు మరింత తగ్గడం, బహుపక్ష వేదికల్లో సహకారం పెరగడం వంటి ఫలితాలు రావచ్చు. అయితే సరిహద్దు విషయంలో ఇంకా పూర్తి పరిష్కారం లేకపోవడం, పరస్పర అపనమ్మకం, ప్రాంతీయ రాజకీయాలు వంటివి సవాళ్లుగా ఉంటాయి. అయితే జిన్‌పింగ్ పర్యటనపై-- అధికారిక ప్రకటన ఇంకా రాలేదుగల్వాన్ ఘటన తర్వాత తొలిసారి జిన్‌పింగ్ భారత్‌కు రావడం రెండు పెద్ద ఆసియా శక్తుల మధ్య సంబంధాలను కొత్త దిశలో నడిపించే అవకాశం ఉంది. బ్రిక్స్ వేదిక దీనికి అనుకూల వాతావరణం కల్పిస్తుంది. అయితే నిజమైన పురోగతి సరిహద్దు, వాణిజ్య సమస్యలపై కాంక్రీట్ చర్యలపైనే ఆధారపడి ఉంటుంది.

# శారీరక దృఢత్వం పోలీసింగ్‌కు పునాది

## ప్రజాసేవలో ఉత్తమ ఫలితాలకు క్రమశిక్షణ తప్పనిసరి
## అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
## వారాంతపు కవాతుకు హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి,

**మహబూబ్ నగర్:**జిల్లా పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ శారీరకంగా దృఢంగా, మానసికంగా అప్రమత్తంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ జానకి, సూచించారు.

శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో నిర్వహించిన వారాంతపు కవాతుకు జిల్లా ఎస్పీ హాజరై పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కవాతులో పాల్గొన్న అధికారులు, పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు.పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, వాటిని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, అప్రమత్తత అత్యంత అవసరమని ఎస్పీ తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొని తమ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ప్రజలకు మెరుగైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో సమయపాలన, అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమ సేవల ద్వారా శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలని



పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి.రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆర్‌ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, రూరల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# లక్ష కోట్లతో పీపీపీలు... నెంబర్ వన్

**విజయవాడ, ఆగస్టు 1:**భారతదేశంలో మౌలిక వసతుల విప్లవాత్మక అభివృద్ధి కోసం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టుల పైప్‌లైన్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశంలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆర్థిక వ్యవహారాల శాఖ విడుదల చేసిన అధికారిక వివరాల ప్రకారం రాష్ట్రాల వారీగా పిలిచిన ప్రతిపాదిత పీపీపీ ప్రాజెక్టుల విలువ, సంఖ్య పరంగా ఏపీ అగ్రభాగాన నిలిచింది. రాష్ట్రంలో ఏకంగా రూ. 1,15,578.81 కోట్ల అంచనా వ్యయంతో 270 మౌలిక వసతుల ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నట్లు కేంద్రం తన నివేదికలో స్పష్టం చేసింది.దేశవ్యాప్తంగా మొత్తం రూ. 17 లక్షల కోట్లకు పైగా విలువైన 852 ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం ఒకే గొడుగు కిందకు తెచ్చి, ప్రైవేట్ పెట్టుబడిదారులకు స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది. ఈ జాబితాలో తమిళనాడు రూ. 87,639.65 కోట్ల విలువైన 70 ప్రాజెక్టులతో రెండో స్థానంలో నిలవగా, మధ్యప్రదేశ్ రూ. 65,496.50 కోట్లతో 21 ప్రాజెక్టులతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. అన్ని ర రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ చాలా ముందంజలో ఉంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామికాభివృద్ధి, రోడ్లు, పోర్టులు, ఇంధన రంగం మరియు పట్టణాభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయడంపై దృష్టి సారించింది. పీపీపీ విధానం ద్వారా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ ప్రతిపాదనలను వేగంగా సిద్ధం చేసి కేంద్ర సమ్మతిని పొందింది. రహదారులు, ఓడరేవులు, లాజిస్టిక్ పార్కులు, ఇంధన రంగానికి చెందిన కీలక ప్రాజెక్టులను ఈ 270 ప్రతిపాదనల్లో పొందుపరిచారు.కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ అధికారిక గణాంకాలు ఆంధ్రప్రదేశ్‌పై అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నిధుల కొరత లేకుండా పీపీపీ నమూనాలో ఈ మౌలిక ప్రాజెక్టులు పట్టాలెక్కితే, రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊపు లభించనుంది.

# నిరుపేద మహిళకు లయన్స్ క్లబ్ చేయూత

**సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్**
**డైరెక్టర్ లయన్ బాబూరావు**
**-క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్**

**కమాన్ పూర్:**ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన నిరుపేద ఒంటరి మహిళ నివసిస్తున్న కిరాయి ఇల్లు కూలిపోవడంతో ఆమె తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబూరావు జన్మదినాన్ని పురస్కరించుకుని, బాధిత మహిళకు నిత్యావసర సరుకులను అందజేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య




యాదవ్ మాట్లాడుతూ అంతర్జాతీయ డైరెక్టర్గా ప్రపంచవ్యాప్తంగా లయన్స్ క్లబ్ల సేవా కార్యక్రమాలకు మార్గనిర్దేశం చేస్తూ సేవే పరమావధి అనే భావనతో లక్షలాది మంది లయన్స్ సభ్యులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆయన నాయకత్వం, సేవా తపన, నిస్వార్థ అంకితభావం లయన్స్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. సమాజ సేవే లయన్స్ ఉద్యమానికి మూల స్ఫూర్తి అని, అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేయూత అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి టీవీ సురేష్ బాబు, పాస్ట్ ప్రెసిడెంట్లు మెల్మురి శ్రీనివాస్, మేకల మారుతి యాదవ్, క్లబ్ చైర్పర్సన్లు గంట వెంకటరమణ రెడ్డి, మర్రి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రియుడిపై మోజు
# భర్తనే చంపాలనుకుంది.,

**చిత్తూరు:**ప్రియుడిపై మోజుతో భర్త, పిల్లలను వదిలేసి వివాహిత వేరే కాపురం పెట్టింది. మొదట భర్తను చంపాలనుకొని స్కెచ్ వేసి.. తర్వాత మనసు మార్చుకొని పారిపోయి ప్రియుడిని పెళ్లి చేసుకుంది. చిత్తూరు జిల్లా గుడుపల్లి మండలం గుడికొత్తూరు గ్రామానికి చెందిన చిరంజీవికి శోభ(27) అనే మహిళతో 8 ఏళ్ల క్రితం వివాహం కాగా.. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ నేపథ్యంలో రాంగ్ కాల్ ద్వారా శోభకు గుంటూరు జిల్లా కంద్రిగకు చెందిన బాలాజీ నాయక్(22) పరిచయమయ్యాడు. ఇన్స్టాగ్రామ్లో చాట్ ద్వారా మరింత స్నేహం పెరిగిఈ జంట ప్రేమలో పడింది. ఈ విషయం తెలిసి తన భర్త రోజూ కొడుతున్నాడని మొదట అతన్ని హత్య చేసి, ఆ తర్వాత ఇద్దరూ పెళ్లి చేసుకుందామని భార్య ప్లాన్ వేసింది. తర్వాత మనసు మార్చుకొని నెల రోజుల క్రితం పారిపోయి కుప్పంలో ఓ గుడిలో శోభ, బాలాజీ నాయక్ పెళ్లి చేసుకున్నారు.భర్త తన భార్య శోభ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ క్రమంలో శోభ మరో యువకుడితో కలిసి బెగ్గిలిపల్లిలో ఉంటున్నట్టు గుర్తించి వారిని భర్త చిరంజీవి తరపు బంధువులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.శోభ తనను పెళ్లి చేసుకోకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిందని, ఆమె బలవంతంతో పెళ్లి చేసుకున్నానని ప్రియుడు బాలాజీ నాయక్ తెలిపాడు. తన భర్త రోజూ అనుమానంతో వేధించి కొట్టేవాడని.. ఆ దెబ్బలు చూసి బాలాజీ నాయక్ తన భర్తను చంపుతానంటే వద్దని పారిపోయి వచ్చి పెళ్లి చేసుకున్నానని భార్య శోభ అంటోంది.ఈ గొడవను పరిష్కరించలేక పోలీసులు తలలు పట్టుకున్నారు.

# విజన్ ఎడ్యుకేషన్ అడుగులు



**హైదరాబాద్, ఆగస్టు 1:**తెలంగాణ విద్యావ్యవస్థలో నూతన అధ్యాయాన్ని లిఖించబోతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థపై తన విజన్ ను ఆవిష్కరించారు. విద్యారంగ సమగ్ర స్వరూపాన్ని మార్చేందుకు తన వద్ద ఉన్న కార్యాచరణను స్పష్టంగా వివరించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు అతీతంగా, రాబోయే తరాల భవిష్యత్తే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన నొక్కి చెప్పారు.గత పాలకులు ఇరిగేషన్ శాఖను తమ వద్ద ఉంచుకుని, వేల పుస్తకాలు చదివామని గొప్పలు చెప్పుకుంటూ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందన్నారు రేవంత్ రెడ్డి. కానీ నేను మాత్రం ఓట్లు లేని, కేవలం బాధ్యత మాత్రమే ఉన్న విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని పరోక్షంగా విపక్షాలకు కౌంటర్ ఇచ్చారు. తానెలాంటి తప్పులు చేయలేదని, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు వివాదాల్లేకుండా పూర్తి చేశానని గుర్తుచేశారు. గడిచిన నాలుగేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, తెలంగాణ విద్యా వ్యవస్థ 28వ స్థానం నుండి 18వ స్థానానికి చేరుకుందని గణాంకాలతో సహా వెల్లడించారు.ప్రైవేట్ పాఠశాలల్లో తల్లిదండ్రులు రూ.50 వేలకు మించి ఖర్చు చేయడం లేదని, కానీ ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై రూ.1.08 లక్షలు వెచ్చిస్తోందని సీఎం స్పష్టం చేశారు. బడ్జెట్‌లో విద్యకు 9 శాతం నిధులు కేటాయిస్తున్నప్పటికీ, నాణ్యతా ప్రమాణాల్లో ప్రపంచంతో పోటీ పడటంలో మనం ఎక్కడో వెనుకబడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ పూర్తయినా కనీసం ఉద్యోగానికి దరఖాస్తు కూడా రాయలేని పరిస్థితి మారి తీరాలని ఉద్ఘాటించారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చడమే కాకుండా, విదేశీ పర్యటనలకు ప్రతి ఏటా ఉపాధ్యాయులను పంపి గ్లోబల్ ఎడ్యుకేషన్‌ను ఇక్కడ అమలు చేస్తామన్నారు.తనకు ఎలాంటి ఇతర కోరికలు లేవని, 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో మీకేమీ అనుమానాలు అక్కర్లేదన్నారు. నల్గొండ వంటి ప్రాంతాల్లో 9 మంది ఉపాధ్యాయులున్నా ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలల పరిస్థితిని నిరసించారు. బదిలీలు చేస్తే ధర్నాలు చేయడం సరికాదన్నారు. "మీ సమస్యలు నాకు వదిలేయండి.. ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు మీ ఇంటికే వస్తాయి. కానీ ఐదేళ్ల పాటు పిల్లల భవిష్యత్తు కోసం నా దారిలోకి వచ్చి పోరాడండి. మండలాల వారీగా క్లస్టర్లను ఏర్పాటు చేసి, పాఠశాలల అభివృద్ధికి మీరే నివేదికలు ఇవ్వండి, వాటిని అమలు చేసే బాధ్యత నాది" అని పిలుపునిచ్చారు.హాస్టల్ సంస్కృతి వల్ల పిల్లలు ఒంటరితనానికి గురై, భవిష్యత్తులో తల్లిదండ్రులను ఓల్డేజ్ హోమ్‌లలో వేసే పరిస్థితి వస్తోందని రేవంత్ రెడ్డి మానవీయ కోణాన్ని స్పృశించారు. టీచర్లు కేవలం బోధకులుగా కాకుండా తల్లిదండ్రుల స్థానంలో ఉండి గైడ్ చేయాలని కోరారు. భాష అనేది కేవలం కమ్యూనికేషన్ సాధనమేనని, జర్మనీ, జపాన్ లాంటి దేశాలపై దృష్టి సారించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. "ప్రభుత్వ బడిలో చదివితే ఏమవుతావని ఎవరైనా అడిగితే.. తెలంగాణ సీఎం అవుతానని గర్వంగా చెప్పండి" అని వ్యాఖ్యానించి ఉపాధ్యాయుల్లో, విద్యార్థుల్లో సరికొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

# మిడిల్ క్లాసు కష్టాలు...

**హైదరాబాద్ ఆగస్టు 1:**ఒకటో తారీకు జీతం వస్తుంది. ఆ తర్వాత ఈఎంఐ కట్టాలి. క్రెడిట్ కార్డు బిల్లు కట్టాలి.. ఇంటి రెంట్ కట్టాలి. పిల్లల స్కూల్ ఫీజులు కట్టాలి. నెలవారి ఖర్చుకు ఎంతోకొంత ఎకౌంట్లో ఉంచుకోవాలి. ఇవన్నీ చేసిన తర్వాత ఏం మిగులుతుంది..జీతం ఆవగింజంత ఉంటే.. ఖర్చులు మామిడికాయ సైజులో ఉంది. ఇలాంటప్పుడు నాలుగు రాళ్లు వెనక వేయడం కాదు కదా.. కనీసం జీవితాన్ని ముందుకు సాగించడం కూడా కష్టమే. నచ్చినవి తినలేము. ఇష్టమైన వాటిని కొనుగోలు చేయలేము. బాగున్న వాటిని సొంతం చేసుకోలేము. ఊహల్లో బతకడం.. కష్టాలను తిట్టుకోవడం.. ఇదే మిడిల్ క్లాస్ జీవితం..మనదేశంలో పేదవాళ్లు ఒక అంచనాలో బతుకుతారు. డబ్బున్న వాళ్లు కూడా ఒక అంచనాలో బతుకుతారు. కానీ మిడిల్ క్లాస్ వాళ్ళు ఎటువంటి అంచనా వేసుకోలేరు. ఎందుకంటే వాళ్లకు ప్రతి విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని.. ముందుగానే జాగ్రత్త పడతారు. జాగ్రత్తగా ఉన్నంత మాత్రాన ఖర్చులు ఆగవు కదా.ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జీవించే మిడిల్ క్లాస్ వాళ్లకు ప్రతిరోజు ఒక పజిల్ మాదిరిగానే ఉంటుంది. అక్కడ జీవించే మిడిల్ క్లాస్ ప్రజల కష్టాల మీద ఒక వ్యక్తి చేసిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది. ఈఎంఐ.. కిరాయిలు.. కుటుంబ ఖర్చులు.. వీటన్నింటికీ జీతం సరిపోక కనీసం మటన్ కూడా కొనుగోలు చేయడం కష్టమవుతుంది. జీవితంలో ఎటువంటి ఎదుగుదల లేకుండా.. పెళ్లి జరిగిన తర్వాత.. పిల్లలు పుట్టిన తర్వాత.. వారి బాధ్యతలతోనే జీవితం సంకనాకి పోతుందని.. ఆ వీడియోలో ఉన్న వ్యక్తి చెప్పాడు. ఈ వీడియోను చాలామంది తమకు అనుకూలంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. తమది కూడా ఇటువంటి దుస్థితేనని వాపోతున్నారు. మా మనసులో ఉన్న బాధను మొత్తం వ్యక్తం చేశావని చాలామంది కామెంట్లు చేస్తున్నారు.గతంతో పోల్చి చూస్తే హైదరాబాద్ నగరంలో మిడిల్ క్లాస్ వల్ల కష్టాలు విపరీతంగా పెరిగిపోయాయి. అన్ని ఖర్చులు పెరిగిపోవడం.. వాటికి తగ్గట్టుగా వేతనాలు పెరగపోవడంతో చాలామంది ఆర్థికంగా కష్టాలు పడుతూనే ఉన్నారు. పెళ్లి.. పిల్లలు.. బాధ్యతలు.. ఇవన్నీ కళ్ళ ముందు కనిపిస్తుంటాయి కాబట్టి.. చాలామంది కష్టాలను పంటి కింద భరిస్తూ.. తమ ఇబ్బందులను తిట్టుకుంటూ జీవితాన్ని సాగిస్తుంటారు. ఎందుకంటే అంతకుమించి చేయడానికి మిడిల్ క్లాస్ వాళ్లకు అవకాశం లేదు.

# కరీంనగర్ లో గల్లీగల్లీని అభివృద్ధి చేస్తా..

## కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి

**కరీంనగర్:**కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని గల్లీగల్లీని అభివృద్ధి చేస్తానని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తానని స్పష్టం చేశారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పరామర్శలతో బిజీబిజీగా గడిపారు. ఉదయం 9 గంటలకు తన నివాసం వద్దకు వచ్చిన సందర్శకులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్న బండి సంజయ్ ఆ తరువాత 10.30 గంటలకు స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.తొలుత 48వ డివిజన్ లోని విద్యానగర్ కురుమవాడలో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తోపాటు స్థానిక కార్పొరేటర్ కర్ర పద్మ అనిల్ తో కలిసి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ నిధుల్లో రూ.80 లక్షలు యూఐడీఎఫ్ నిధులు కాగా, మిగిలిన రూ.20 లక్షలు మున్సిపల్ సాధారణ ఫండ్ కు సంబంధించినవి.అనంతరం 19వ డివిజన్ లోని రేకుర్తి ముదిరాజ్ కాలనీకి వెళ్లిన కేంద్ర మంత్రి రూ.40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అట్లాగే లక్ష్మీ నరసింహ కాలనీలో రూ.57 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడి



నుండి మొగ్దుంపూర్ వెళ్లిన కేంద్ర మంత్రి రూ.10 లక్షల జాతీయ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మహిళాశక్తి ధరణి గ్రామైఖ్య సంఘ భవనాన్ని స్థానిక సర్పంచ్ శివకుమార్ తో కలిసి ప్రారంభించారు.అట్లాగే రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్ ను ప్రారంభించారు.అంతకుముందు చింతకుంట వెళ్లిన కేంద్ర మంత్రి బండి సంజయ్ అంబేద్కర్ భవన్ సమీపంలో నిర్వహించిన 'వన మహోత్సవం-2026 లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు అధికారులతోపాటు మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి స్వయంగా మొక్కలను నాటారు. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, అధికారులు సైతం మొక్కలు నాటారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.కరీంనగర్ కార్పొరేషన్ లోని ప్రతి గల్లీగల్లీని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ముఖ్యంగా అభివృద్ధికి అంతగా నోచుకోని నగర శివారు గ్రామాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అందుకోసం కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తాం. ఇప్పటికే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం. ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే అర్బన్ డెవలెప్ మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చినయ్. వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి.తాజాగా 840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి. కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం. స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తాం. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అభివృద్ధిలో తెలంగాణలోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నాం. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తనకు ఓట్లేసి గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు శాయశక్తులా క్రుషి చేస్తున్నా. అందుకోసం నా పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే రూ.22 వేల కోట్లు నిధులు ఖర్చు పెట్టిన. పలు అభివృద్ధి పనులు చేసిన. త్వరలోనే వివిధ కేంద్ర పథకాల కింద మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నా.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్:**గౌరవెల్లి ప్రాజెక్టుతో పాటు పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులను కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం తో సంప్రదింపులు జరుపుతూ, అభిషేక్ సింగ్వి లాంటి మంచి న్యాయవాదులను నియమించి సుప్రీంకోర్టు లో న్యాయపరంగా సమర్థవంతంగా పోరాడిన ఫలితంగానే ఈ తీర్పు వచ్చిందన్నారు. గౌరవెల్లి, పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు ఈ తీర్పు కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయని, రైతులకు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇవి ఎంతో దోహదపడతాయని మంత్రి తెలిపారు.తెలంగాణ హక్కులను పరిరక్షించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చొరవ, ప్రభుత్వం చేసిన న్యాయపోరాటం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు



# ఉగ్రగోదావరి..

- మొదటి పేజీ తరువాయి

మారాయి.చార్ల మండలం వీరాపురం శివారులోని ఇసుక క్వారీలో అకస్మాత్తుగా వరద రావడంతో 44 మంది లారీ డ్రైవర్లు, స్థానికులు చిక్కుకుపోయారు. అధికారులు వారిని సురక్షితంగా కాపాడారు. అయితే 30కి పైగా లారీలు అక్కడే నీటిలో చిక్కుకుపోయాయి. సహాయక చర్యల సమయంలో ఇద్దరు పోలీసు అధికారులు తెప్పపై నుంచి నీటిలో పడినా, ఈదుకుంటూ క్షేమంగా బయటపడ్డారు. అశ్వాపురం మండలంలో ఓ గర్భిణిని థర్మాకోల్ తెప్పపై సురక్షిత ప్రాంతానికి తరలించారు.మరోవైపు, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణలో రాబోయే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది

# వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు..

- మొదటి పేజీ తరువాయి

మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

- మొదటి పేజీ తరువాయి

బుధవారం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసింది. పోలీస్ శాఖతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. మొత్తం ఖాళీలలో అత్యధికంగా కానిస్టేబుల్, ఆ పైస్థాయి ఉద్యోగాలే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోస్టుల వివరాలను పరిశీలిస్తే సివిల్ ఎస్సై-148, ఏఆర్ ఎస్సై-14, టీజీఎస్పీ ఏఆర్ ఎస్సై-12, ఎస్ఏఆర్ సీపీఎల్ ఎస్సై-03, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై-23, సివిల్ కానిస్టేబుల్-3,697, ఏఆర్ కానిస్టేబుల్-1,052, ఎస్ఏఆర్ సీపీఎల్ కానిస్టేబుల్-24, కానిస్టేబుల్ (డ్రైవర్) పీటీవో-20, కానిస్టేబుల్ (మెకానిక్) పీటీవో-07 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

# కమలం కొత్త వ్యూహం

- మొదటి పేజీ తరువాయి

కూడా నియమించుకున్నారని తెలిసింది. తమ పర్యటనలతో పాటు ప్రభుత్వంపై విమర్శలు కూడా ఇందులో చోటు చేసుకుంటున్నాయి. సోషల్ మీడియా వ్యూహాలతోనే అధికారంలోకి రాగలమని బీజేపీ కేంద్ర నాయకత్వం నమ్ముతుంది. దేశంలో, రాష్ట్రంలోసోషల్ మీడియా వినియోగం పెరిగిపోవడంతో దానిని అందిపుచ్చుకుని వెళితే తప్ప అధికారానికి దగ్గరకు కాలేమని పదే పదే చెప్పిన మాటలు కమలనాథులకు ఇప్పటికి చెవికి ఎక్కినట్లున్నాయి. ప్రభుత్వంపై విమర్శలతో పాటు కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పాలనా విధానాలను, నిర్ణయాలను నిరసిస్తూ నిరంతరం డిజిటల్ అస్త్రాలు సంధిస్తున్నారురాష్ట్ర ప్రభుత్వ హామీలు, ప్రజా సమస్యలపై ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్‌లతో సోషల్ మీడియాలో పోస్టులు హోరెత్తిస్తున్నారు.రాష్ట్ర నాయకులు సైతం ఆన్‌లైన్ చర్చల్లో పాల్గొంటూ కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. మొత్తం మీద తెలంగాణ బీజేపీలో పెద్ద మార్పు వచ్చినట్లుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# మంత్రి విస్తరణ లేనట్టే...

- మొదటి పేజీ తరువాయి

కేబినెట్ విస్తరణ లేదా మార్పుచేర్పులకు మాత్రం అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో చాన్నాళ్లుగా మంత్రి పదవులపై ఆశలు పెంచుకున్న ఆశావహులకు నిరాశే మిగిలింది.ఈ నిర్ణయం వెనుక అధిష్ఠానం ఊరుకున్నంత ఉత్తమం.. బోడిగుండంత సుఖం అనే రక్షణాత్మక వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం తెలంగాణ మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్తుల భర్తీ లేదా రీషఫుల్ చేపడితే.. పార్టీలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రేగుతాయనే భయం అధిష్ఠానంలో ఉంది. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్‌లోనూ, పార్టీ అంతర్గత రాజకీయంలోనూ చోటుచేసుకున్న పరిణామాలు, అసంతృప్తుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణలో ఉన్న శాంతిభద్రతలను, ప్రభుత్వ స్థిరత్వాన్ని దెబ్బతీసే సాహసం ఇప్పుడు చేయకూడదని హైకమాండ్ ఒక స్పష్టమైన ముగింపునకు వచ్చినట్లు తెలుస్తోంది.మరోవైపు, కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల పోటీ ఊహించని మలుపులు తిరుగుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వంటి సీనియర్లు ఒకవైపు గట్టిగా ఒత్తిడి తెస్తుండగా.. జెన్-జీ నినాదంతో యువ ఎమ్మెల్యేలకు సైతం ప్రాతినిధ్యం కల్పించాలనే చర్చ సరికొత్త సమీకరణాలను తెచ్చిపెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి సైతం యువ ముఖాలకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనను తెరపైకి తెచ్చినట్లు వార్తలు రావడం, స్థానిక సంస్థల సమయానికి ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలనే వ్యూహాలు రేసును మరింత సంక్లిష్టంగా మార్చాయి. సీనియర్ వర్సెస్ జూనియర్, రెడ్డి వర్సెస్ బీసీ, ఎస్సీ సామాజిక సమీకరణాల మధ్య సమతుల్యత సాధించడం దాదాపు అసాధ్యంగా మారడంతోనే విస్తరణ నిర్ణయాన్ని వాయిదా వేశారు.ఢిల్లీ వేదికగా ఏఐసీసీ పెద్దలు తెలంగాణ నేతలకు చాలా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పాలిటిక్స్ పక్కనపెట్టి, పాలనపై దృష్టి సారించాలని, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి వేగంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి 45 రోజులకు ఒకసారి పీసీసీ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి.. ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం మధ్య సయోధ్యను పెంచాలని ఆదేశించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి పెట్టాలని, మంత్రి పదవుల కోసం ఢిల్లీ చుట్టూ తిరగడం కన్నా నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆశావహులకు నర్మగర్భ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. హైకమాండ్ వ్యూహాన్ని గమనిస్తే.. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన వేళ, ఈ రకమైన అంతర్గత కుమ్ములాటలు, ముఠా తగాదాలు బయటపడితే అది కాంగ్రెస్ ఇమేజ్‌ను ప్రజల్లో దెబ్బతీస్తుందనే ఆందోళన వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే కేబినెట్‌ను కదిలించి తేనెతుట్టెను రేపడం కంటే ఉన్న వనరులతోనే పాలనను పరుగులు పెట్టించడం శ్రేయస్కరమని భావిస్తున్నారు. ఢిల్లీ పర్యటనతో ఏదో ఒక శుభవార్త వింటామని భావించిన ఆశావహులకు అధిష్ఠానం రివర్స్ షాక్ ఇచ్చిందనే చెప్పాలి. పదుల సంఖ్యలో ఉన్న మంత్రి పదవుల పోటీదారులకు చెక్ పెడుతూ, సర్కార్ గ్రాఫ్‌ను పెంచుకునే పనుల్లో నిమగ్నం కావాలని ఆదేశించడంతో.. తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రస్తుతానికి మళ్లీ మొదటికొచ్చినట్లే కనిపిస్తోంది

# కొత్త బిజినెస్ లలో స్టార్ హీరోలు

**హైదరాబాద్, ఆగస్టు 1:**టాలీవుడ్ స్టార్ హీరోలు ఇప్పుడు సినిమాల్లో నటించడానికే పరిమితం కావడం లేదు. నిర్మాణం, పంపిణీతో పాటు థియేటర్ బిజినెస్‌లోనూ పెట్టుబడులు పెడుతున్నారు. ఒకప్పుడు ఈ రంగంలో నిర్మాతలు, ఎగ్జిబిటర్లే ఎక్కువగా కనిపించేవారు. ఇప్పుడు స్టార్ హీరోలు కూడా తమ సొంత బ్రాండ్‌తో మల్టీప్లెక్స్‌లను ఏర్పాటు చేస్తూ ఎగ్జిబిషన్ రంగంలోకి అడుగుపెడుతున్నారు.ఈ జాబితాలో ముందుగా గుర్తొచ్చే పేరు మహేశ్ బాబుదే. హైదరాబాద్‌లోని ఏఎంబీ సినిమాస్ దేశంలోనే అత్యాధునిక మల్టీప్లెక్స్‌లలో ఒకటిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత అల్లు అర్జున్ కూడా ఏఏఏ సినిమాస్తో ఈ రంగంలోకి అడుగుపెట్టారు. తాజాగా మాస్ మహారాజా రవితేజ కూడా థియేటర్ బిజినెస్‌లో పెట్టుబడులు పెట్టి తన ఉనికిని చాటుతున్నారు.ఇప్పుడు ఈ జాబితాలోకి జూనియర్ ఎన్టీఆర్ కూడా చేరబోతున్నారనే ప్రచారం ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలో అత్యాధునిక ప్రీమియం మల్టీప్లెక్స్ నిర్మించేందుకు తారక్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ వంటి ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

వార్తాతరంగాలు
ఆదివారం 02 ఆగస్టు 2026

# తన్నీరు వర్సెస్ కల్వకుంట్ల...

## చాపకింద నీరులా పోరు



**మెదక్, ఆగస్టు 1,:**సిద్ధిపేట జిల్లాలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ లీడర్ తన్నీరు హరీశ్ రావు నిర్వహించిన పాదయాత్ర గులాబీ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య చర్చకు తెరలేపింది. రైతాంగ సమస్యలు, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి విడుదల డిమాండ్‌తో హరీశ్ రావు చేపట్టిన ఈ యాత్రకు క్షేత్రస్థాయిలో ప్రజలు, రైతుల నుంచి విశేష స్పందన లభించింది. కేవలం నియోజకవర్గ లేదా జిల్లా స్థాయి నిరసనగా కాకుండా, ఒక బహుళ ప్రజా ఉద్యమంగా ఈ యాత్ర రూపాంతరం చెందడంతో రాష్ట్రవ్యాప్తంగా హరీశ్ రావు పాదయాత్ర చేపడితే పార్టీకి పూర్వవైభవం సాధించడం తేలికవుతుందనే అభిప్రాయాలు బీఆర్ఎస్ వర్గాల్లో బలపడుతున్నాయి.అయితే, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌ను మళ్లీ అధికార దిశగా నడిపించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రస్థాయి యాత్రలు, సభల బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కేటీఆర్ నేతృత్వంలోనే కార్యక్రమాలు చేపట్టాలని హైకమాండ్ భావిస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయి కేడర్ మాత్రం మాస్ కనెక్టివిటీ ఉన్న హరీశ్ రావు వైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్నట్లు కనిపిస్తోంది. పల్లెల్లో రైతులు, సామాన్య ప్రజలతో కలిసిపోయే నైజం, సుదీర్ఘమైన సంక్షోభ నిర్వహణ అనుభవం ఉన్న హరీశ్ రావు అయితేనే కాంగ్రెస్ వైఫల్యాలను జనంలోకి బలంగా తీసుకెళ్లగలరనే వాదన గులాబీ శ్రేణుల్లో విపరీతంగా పెరిగింది.ఈ భిన్నమైన అభిప్రాయాలు బీఆర్ఎస్ లోపల ఏమైనా అంతర్గత సంక్షోభాన్ని కాకపోయినా నాయకత్వ సవాలు గా చూడవచ్చు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచీ కేటీఆర్ గ్రామీణ, పట్టణ డిజిటల్ నెట్‌వర్కింగ్, నేషనల్ అప్పీల్‌తో కార్పొరేట్ లుక్‌ను ప్రతిబింబిస్తే, హరీశ్ రావు పక్కా తెలంగాణ మాస్, అగ్రికల్చర్, గ్రౌండ్-లెవల్ ఆర్గనైజేషనల్ పవర్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా బిల్డప్‌ల కంటే భౌతికంగా జనంలో తిరిగే నాయకుడికే ఎక్కువ ఆదరణ ఉంటుంది కాబట్టి, సహజంగానే హరీశ్ రావు గ్రాఫ్ పార్టీ శ్రేణుల్లో పైచేయి సాధిస్తోంది. కేసీఆర్ క్రియాశీల రాజకీయాలకు కొంత దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ప్రస్తుత వాతావరణంలో, పార్టీకి అధిపతి ఎవరు అనే దానిపై ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది. కేటీఆర్‌ను తదుపరి వారసుడిగా ప్రాజెక్ట్ చేసే క్రమంలో హరీశ్ రావు పాత్రను కేవలం సిద్ధిపేట లేదా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధికే పరిమితం చేస్తున్నారనే అసంతృప్తి హరీశ్ మద్దతుదారుల్లో చాలా కాలంగా ఉంది. ఇప్పుడు సిద్ధిపేట పాదయాత్ర సక్సెస్ కావడంతో.. హరీశ్ రావుకు రాష్ట్రస్థాయిలో స్వేచ్ఛనిస్తే కేటీఆర్ ప్రాబల్యం తగ్గుతుందనే ముందస్తు వ్యూహంతోనే ఆయనను మిగతా జిల్లాల్లో పాదయాత్రలకు అనుమతించడం లేదనే ఆరోపణలు విపక్షాల నుంచి రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి మార్క్ అగ్రెసివ్ రాజకీయాన్ని ఎదుర్కోవాలంటే కేవలం హైదరాబాద్ వేదికగా చేసే ప్రెస్ మీట్లు, ట్విట్టర్ వార్తలతో సాధ్యం కాదని బీఆర్ఎస్ శ్రేణులు గుర్తించాయి. ఈ క్రమంలోనే ధర్నా చౌక్‌లు, ప్రాజెక్టుల సందర్శన, పొలాల బాట పట్టే విషయంలో హరీశ్ రావు చూపిస్తున్న చొరవను పార్టీ శ్రేణులు స్వాగతిస్తున్నాయి. ఈ పరిణామాలు బీఆర్ఎస్‌లో ప్రత్యక్ష చీలికకు దారితీయకపోయినా, అధికారికంగా పార్టీని నడిపిస్తున్న వర్గానికి, క్షేత్రస్థాయి బలమున్న హరీశ్ వర్గానికి మధ్య ఒక రకమైన సైలెంట్ పవర్ స్ట్రగుల్ నడుస్తోందనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కేసీఆర్ స్పందించి కేటీఆర్, హరీశ్ రావుల మధ్య స్పష్టమైన బాధ్యతల విభజన చేయకపోతే ఈ నెరేటివ్ పార్టీకి తీవ్ర నష్టం చేకూర్చే అవకాశం ఉంది. ఒకరికి గ్రేటర్ హైదరాబాద్, అర్బన్ నియోజకవర్గాలు, మరొకరికి రూరల్ తెలంగాణ, రైతు పోరాటాల బాధ్యతలు అప్పగించాలన్న సూచనలు కూడా పార్టీ పెద్దలకు అందుతున్నాయి.

# ఉగ్రరూపం దాల్చిన గోదావరి..

**పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించిన మంత్రి సీతక్క**
**భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు**
**మంగపేటలో అధికారులతో కలిసి పర్యటించిన సీతక్క**
**వరద నిర్వాసితులతో నేరుగా మాట్లాడిన మంత్రి**



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయారు. ఈ నేపథ్యంలో, మంత్రి సీతక్క స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు దిగారు. భద్రాచలం ఎగువన ఉన్న మంగపేట మండల కేంద్రానికి ఈ ఉదయం చేరుకున్న ఆమె... గోదావరి ఉధృతిని, కరకట్ట పనుల పురోగతిని సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలు ఏ మేరకు ముంపునకు గురయ్యాయనే వివరాలను రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఐబీ అధికారులతో మాట్లాడి ఆరా తీశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పొద్మూరు, ముస్లిం వాడ, బీసీ కాలనీ పరిధిలోని ముంపు బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంత్రి సందర్శించారు. నిర్వాసితులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న భోజన, వసతి సౌకర్యాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. గోదావరి ఉధృతి తగ్గేవరకు అధికారులు ఎవరూ హెడ్‌క్వార్టర్స్ వదలి వెళ్లకుండా నిరంతరం అందుబాటులోనే ఉండాలని, నిర్వాసితులకు అవసరమైన సహాయక చర్యలు త్వరితగతిన అందించాలని సీతక్క ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న లోతట్టు ముంపు పరిస్థితులపై తహసీల్దార్ తోట రవీందర్, ఎస్సై టీవీఆర్ సూరి, ఎంపీడీవో భద్రులు మంత్రికి నివేదించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, సీనియర్ నాయకులు మైల జయరాంరెడ్డి, వెంకట్ రెడ్డి, భగవాన్ రెడ్డి, మల్లయ్య, పెద్ది నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15 నుంచి కొత్త పెన్షన్లు...



**వరంగల్, ఆగస్టు 1:**తెలంగాణ రాష్ట్రంలో కొత్త పింఛన్ల పంపిణీని ఆగస్టు 15 నుంచి ప్రారంభించాలనే నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్నారు. ఈ పింఛన్లు ముఖ్యంగా తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా బాధితుల కోసం ప్రత్యేకంగా అందించబడనున్నాయి. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్ శాఖపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వెల్లడించారు. ముఖ్యమంత్రి, బాధిత కుటుంబాలకు ఉపశమనం కలిగించేందుకు ఈ పింఛన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అర్హులైన బాధితులను గుర్తించి, వెంటనే పింఛన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వితంతు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులందరికీ కూడా పింఛన్లు మంజూరు చేయాలని సీఎం సూచించారు. దివ్యాంగులు చనిపోయినప్పుడు వారి భార్యలకు ఆలస్యం లేకుండా వెంటనే పింఛన్లు అందించాలనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.మండల స్థాయిలో అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు ఎంపీడీవోలు బాధ్యత వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. మండల పరిషత్తు సమావేశాలను 45 రోజులకు ఒకసారి నిర్వహించాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని తెలిపారు. ఈ సమావేశాలు గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు సహాయపడతాయని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. పంచాయతీ కార్యాలయాలు గ్రామ జనాభా ఆధారంగా వర్గీకరించి నిర్మించాలనే ఆదేశాలు కూడా ఇచ్చారు. పారిశుద్ధ్య పనులు, ఇతర అంశాలకు సంబంధించి కార్యదర్శులు పూర్తి స్థాయిలో బాధ్యత వహించాలని సీఎం తెలిపారు.ఇందిరమ్మ చీరల పంపిణీకి సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో తాగు నీటి సరఫరాలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ తాగు నీటి సరఫరా, హైదరాబాదు వాటర్ బోర్డ్, ఇరిగేషన్ అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించాలి. తాగు నీటికి ప్రాధమికత ఇవ్వాలని ఆయన తెలిపారు. గ్రామీణ తాగు నీటి పథకాల పరిధిలో పనిచేసే వారికి వేతనాలు కచ్చితంగా ఐదో తేదీలోపు అందించాలనే ఆదేశాలు ఇచ్చారు. కోటి మంది మహిళలకు పంపిణీ చేయాల్సిన ఇందిరమ్మ చీరలు ఆకట్టుకునే డిజైన్‌లో ఉండాలని, నాణ్యత విషయంలో ఎటువంటి రాజీపడొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డిజైన్ల రూపకల్పనలో నిఫ్ట్ విద్యార్థులను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

# డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష స్పందన

**ప్రజల సమస్యల పరిష్కారానికి**
**మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణ చర్యలు**




**హుస్నాబాద్:**హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దాదాపు 80కి పైగా ఫోన్ కాల్స్‌కు స్వయంగా స్పందించారు. ప్రజలు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి, సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, భూ సమస్యలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పెండింగ్ అభివృద్ధి పనుల పూర్తి, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన వేదికగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించడం తన బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి సమస్యను బాధ్యతాయుతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు

# రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేయాలి

**హైకోర్టు**



**హైదరాబాద్:** తెలంగాణ హైడ్రా శాంతాశ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కేసులో హైకోర్టు తీర్పు వెలువరించింది. వివాదాస్పద ఆస్తిలోకి యంత్రాలు, సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమన్న హైకోర్టు.. రంగనాథ్‌ను వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎస్‌కు సూచించింది. ఇందుకు టాటా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉదహరించింది. చట్ట పాలన మాత్రమే కొనసాగాలని, వ్యక్తుల పాలన కాదని పేర్కొంది. వ్యక్తి ఆధిపత్యం పెరిగిందనేందుకు ఇదొక ఉదాహరణ అని అభిప్రాయపడింది.

# క్యూర్ కు... 28 శాతం మార్కులే




**హైదరాబాద్ ఆగస్టు 1:**70 ఏళ్ల చరిత్ర కలిగిన జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 'క్యూర్' ముసాయిదా బిల్లు మహానగర పాలనా సంస్కరణల విషయంలో ఆశించిన స్థాయిలో లేదని విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. బెంగళూరు కేంద్రంగా పని చేసే పాలనా అధ్యయన సంస్థ 'జనాగ్రహ' నిర్వహించిన సమీక్షలో ఈ ముసాయిదాకు కేవలం 28 శాతం మార్కులే లభించాయి. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక తీసుకొచ్చిన 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' (జీబీఏ చట్టం 2024) సాధించిన 38 శాతంతో పోలిస్తే.. హైదరాబాద్ కోసం ప్రతిపాదించిన ఈ బిల్లు సంస్కరణల పరంగా వెనుకబడి ఉందని సదరు అధ్యయనం ఎత్తిచూపింది.హైదరాబాద్ నగరాన్ని సమగ్రమైన ఏకైక అర్బన్ రీజియన్‌గా ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు ఒక అధికారిక ఏకీకృత వ్యవస్థ లేకపోవడమే ఈ బిల్లులోని ప్రధాన లోపంగా విశ్లేషణ పేర్కొంది. ప్రస్తుతం రవాణా, గృహ నిర్మాణం, మురుగునీటి పారుదల, భూ వినియోగం వంటి కీలకమైన బాధ్యతలను వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీలు ఎవరికి వారే స్వతంత్రంగా నిర్వహిస్తున్నాయని నివేదిక తెలిపింది. వేర్వేరు సంస్థల మధ్య అనుసంధానం లోపించడంతో నగర అభివృద్ధి ప్రణాళికలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయని స్పష్టం చేసింది.నగర పాలన సమర్థవంతంగా సాగాలంటే ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రజాప్రతినిధులకు సమస్యలను తక్షణమే పరిష్కరించే అసలైన అధికారాలు ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా మేయర్, కౌన్సిలర్ల అధికారాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని.. నైబర్‌హుడ్ పరిధిలోని నిర్ణయాల్లో స్థానిక పౌరులకు భాగస్వామ్యం కల్పించేలా స్పష్టమైన నిబంధనలు చేర్చాలని సూచించారు. నగర పరిపాలనా వ్యవస్థను నిరంతరం జవాబుదారీగా ఉంచేందుకు స్వతంత్ర పర్యవేక్షణ, తనిఖీ యంత్రాంగాన్ని నెలకొల్పాలని పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ (ఎంపీసీ), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉండే అత్యున్నత పాలనా మండలి విధుల మధ్య ఎలాంటి పునరావృతం లేకుండా స్పష్టమైన విభజన ఉండాలని పేర్కొన్నారు.బృహత్తర నగరాల నిర్వహణలో భారత దేశంలోనే హైదరాబాద్ ఒక మార్గదర్శక మహానగర పాలనా నమూనాగా ఎదిగేందుకు గొప్ప అవకాశం ఉందని జనాగ్రహ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ విశ్వనాథన్ అభిప్రాయ పడ్డారు. అత్యున్నత పాలనా మండలి సజావుగా పని చేసేందుకు ఒక పూర్తిస్థాయి సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే నగర ప్రాధాన్యతలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు హైదరాబాద్ వ్యవహారాల మంత్రి వంటి ప్రత్యేక రాజకీయ బాధ్యుడిని నియమించాలని ఆయన స్పష్టం చేశారు.

# లష్కర్ బోనాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు




**హైదరాబాద్ సిటీ:** లష్కర్ బోనాలకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి 175 ప్రత్యేక బస్సులు నడపడానికి చర్యలు చేపట్టామని ఆర్టీసీ గ్రేటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఎంజీబీఎస్, కాచిగూడ రైల్వేస్టేషన్, జేబీఎస్, చార్మినార్, బాలాజీనగర్, నాంపల్లి, రిసాల్‌బజార్, వెంకటాపురం, ఓల్డ్ అల్వాల్, మెహిదీపట్నం, కుషాయిగూడ, చర్లపల్లి, హకీంపేట, ఓల్డ్ బోయిన్‌పల్లి, చార్మినార్, మెహిదీపట్నం, సైనిక్‌పురి, సనత్‌నగర్, జామై ఉస్మానియా, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, కేపీహెచ్‌బీ, బోరబండ, పటాన్‌చెరు ప్రాంతాల నుంచి సికింద్రాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. ప్రత్యేక బస్సులు, ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసింది.

**హెల్ప్ డెస్కులు**
సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ - 9959226147
జూబ్లీబస్ స్టేషన్ (జేబీఎస్) - 9959226143
మహాత్మాగాంధీ బస్ స్టేషర్ (ఎంజీబీఎస్) - 9959226130
జోనల్ కమ్యూనికేషన్ సెల్, జూబ్లీబస్‌స్టేషన్ - 9959226160

# నాగర్కర్నూల్ జిల్లాలో న్యాయవాది దారుణ హత్య

**కళ్లలో కారం చల్లి, వేటకొడవళ్లతో నరికి దారుణ హత్య**



**నాగర్ కర్నూలు:**నాగర్కర్నూల్ జిల్లా పెంట్లవెల్లిలో ఆర్ఎంపీ, న్యాయవాదిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న మల్లయ్య(55) తన క్లినిక్లో ఉండగా తమకు ఆరోగ్యం బాగాలేదని గుర్తుతెలియని ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు వచ్చారు. మల్లయ్య కళ్లల్లో కారం చల్లారు. తరువాత ప్రధాన రహదారిపైకి లాక్కొచ్చి వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికి చంపారు. దాడిలో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భూ తగాదాలే హత్యకు కారణమని అనుమానానిస్తున్నారు.

# మహిళను మోసం చేసిన ఎస్సై అరెస్టు

**హైదరాబాద్:**తెలంగాణలో మహిళలను వేధిస్తున్న పోలీసుల జాబితలో మరో ఎస్సై పేరు చేరింది. మహిళలపై లైంగిక దాడి కేసులో ఎస్సై శ్రీకాంత్ అరెస్ట్ అయ్యాడు. సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకొని మహిళలను మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగిక దాడి చేసినట్లు కేసు నమోదయింది. హైదరాబాద్ యువతి ఫిర్యాదుతో జగిత్యాల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసారు. సాంకేతిక ఆధారాలతో నిజామాబాద్లో పోలీసులు నిందితుడిని గుర్తించారు. ఎస్సై శ్రీకాంత్ను అరెస్ట్ చేసి హనుమకొండకు తరలించారు. నిందితుడు సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎస్సైగా గుర్తించారు.

# పిల్లల హక్కుల పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం

**పాఠశాలల్లో విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే వెంటనే స్పందించాలి**

**జిల్లాలో బాల్య వివాహాలు, బాల కార్మికత్వాన్ని పూర్తిగా నిర్మూలించాలి**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి**



**జోగులాంబ గద్వాల, ఆగస్టు1(స్కై న్యూస్):**పిల్లల హక్కుల పరిరక్షణ,భద్రత కల్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ కళ్యాణ చక్రవర్తి అన్నారు.జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నాల్స "పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం--2024" పై చైల్డ్ ప్రొటెక్షన్ అధికారుల కోసం శనివారం గద్వాల పట్టణంలోని అనంత ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఒక రోజు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నాల్సా --పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం--2024 ద్వారా ప్రతి చిన్నారికి ఉచిత న్యాయ సహాయం,పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవలు అందించడం అన్నారు.అలాగే వారికి చట్టాలపై అవగాహన, అవసరమైన కౌన్సెలింగ్, రక్షణ,పునరావాసం అందించడమే లక్ష్యమన్నారు.పిల్లల గోప్యత, గౌరవం,భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ,సంబంధిత శాఖల సమన్వయంతో వారి శ్రేయస్సు కోసం ఈ పథకం పనిచేస్తుందని వివరించారు.పోక్సో (పొక్సో) చట్టం--2012లో మొత్తం 46 సెక్షన్లు ఉన్నాయని,ఈ చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ పిల్లలుగా పరిగణించబడతారని తెలిపారు. పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించడం,బాధితులకు న్యాయ పరిరక్షణ కల్పించడం,నేరస్థులకు కఠిన శిక్షలు విధించడమే పోక్సో చట్టం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనలో అసాధారణ మార్పులు కనిపిస్తే ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని, వేధింపులు లేదా హింసకు గురవుతున్నట్లు అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు.ప్రతి విద్యార్థి భద్రత,సంక్షేమంపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి విద్యాభ్యాసంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని అన్నారు.పిల్లలపై జరిగే వేధింపులు,బాల్య వివాహాలు, బాల కార్మికత్వాన్ని అరికట్టేందుకు సంబంధిత అధికారులు చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, ప్రతి చిన్నారికి సురక్షితమైన, వివక్షలేని వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం నాల్సా --పిల్లలకు అనుకూల న్యాయ సేవల పథకం--2024,పోక్సో చట్టం,బాలల హక్కులు,బాల్య వివాహాల నివారణ,బాల కార్మిక నిర్మూలన, పిల్లల రక్షణపై అవగాహన కల్పించే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ సెషన్స్ న్యాయమూర్తి వి.శ్రీనివాస్,జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎ.నాగరాజు,జిల్లా విద్యా శాఖ అధికారి విజయ లక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సునంద, సీడీపీఓ ఆకాశ దీప్తి, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

# పోతుల వెంకన్న ఆశయాలను నెరవేర్చాలి

**ఉట్కూరు ఆగస్టు 1(స్కై న్యూస్)** దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలు దోపిడీదారులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీని ఈ ప్రాంతంలోకి తీసుకువచ్చి ఎన్నో పోరాటాలు నిర్వహించిన పోతుల వెంకన్న ఆశయాలను నెరవేర్చేందుకు యువత ముందుకు రావాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు శనివారం ఆయన 15వ వర్ధంతిని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన దళితుల సమస్యలపై ఎన్నో పోరాటాలు నిర్వహించారని ప్రజలను చైతన్యం చేయడంలో ఎనలేని కృషి చేశారని వివరించారు. దౌర్జన్యాలను వెంటపడుతూ ధైర్య సాహసాలతో పోరాటం నిర్వహిస్తూ కమ్యూనిస్టు నాయకులతో చర్చించి ప్రజలను ఏకం చేశారని కొనియాడారు గ్రామాలలో ఉన్న రెండు గ్లాసుల విధానాన్ని వ్యతిరేకించడంతోపాటు ఆలయ ప్రవేశాలకు అంకురార్పణ చేశారని అంటరానితనం వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు




దళితులను ఏకం చేసి కమ్యూనిస్టు పార్టీలో పనిచేసేలా చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు ఆశన్న చిన్న వెంకన్న తో పాటు అనేక మందిని కలుపుకొని కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేశారని తెలిపారు రాబోయే రోజులలో ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ గ్రామ కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## భారత రాష్ట్ర సమితిలో చేరిన ఎబివిపి నాయకుడు సొప్పరి నరేందర్



**కేశంపేట మండలం ఆగస్టు 01(స్కై న్యూస్):**కేశంపేట మండలంలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు సొప్పరి నరేందర్ భారత రాష్ట్ర సమితి పార్టలో చేరారు. గ్రామ సర్పంచ్ సొప్పరి ధనలక్ష్మి రామక్రిష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పార్టీ కండువా కప్పి సొప్పరి నరేందర్‌ను బీఆర్ఎస్‌లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజాసేవకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి లక్ష్యాలతో ప్రజలకు మరింత చేరువై పనిచేస్తానని సొప్పరి నరేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి,సర్పంచులు వేణు గోపాల చారి, సొప్పరి ధనలక్ష్మి రామక్రిష్ణ, మాజీ సర్పంచ్ కామ్లెకార్ నవీన్ కుమార్, నాయకులు శ్రీహరి యాదవ్, సలీం, రంగు శ్రీకాంత్, అయిలాపురం సంతోష్ రెడ్డి, కాకర్ల సునీల్, చిత్రమోని చెన్నయ్య, సోమరాజు మహేష్, రంగు రాకేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి.

## అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలి

**ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**




**అచ్చంపేట ఆగస్టు 1( స్కై న్యూస్)** అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు నిరంతరం అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ సంక్షేమ పథకాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచించారు శనివారం నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండల కేంద్రంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు వివరించేలా అధికారులు కృషి చేయాలని కోరారు. అర్హులకు న్యాయం జరిగేలా చూడవలసిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగం పై ఉందని అన్నారు ఈ సమావేశంలో మండల స్థాయి ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు

## పెన్షనర్స్ అందరికి పాత ఈహెచ్ ఎస్ కార్డ్స్ తో కార్పొరేట్ హాస్పిటల్స్ లో వైద్యం

**- లక్ష్మీ రెడ్డి జిల్లా అధ్యక్షులు**



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 1(స్కై న్యూస్):** ప్రభుత్వ పెన్షనర్స్ కు పాత ఈహెచ్ఎస్ కార్డులో ద్వారా కార్పొరేట్ హాస్పిటల్స్ లో వైద్యం అందుతుందని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీరెడ్డి అన్నారు. శనివారం గద్వాల పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డ్ లో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు బాలకిషన్ రావు ఆధ్వర్యంలో సభ్యులతో సమావేశము జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి వివరించడం జరిగిందని తెలిపారు. పెన్షనర్స్ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పెన్షనర్స్ నుండి ఈ హెచ్ ఎస్ ప్రీమియం మే 2026 నుండి బేసిక్ పే 1.5 శాతం తగ్గింపబడి ట్రస్ట్ కు జమచేయబడుతుందనీ, 17-07-2026 నుండి క్యాష్లెస్ ట్రీట్మెంట్ మొదలైన నాటి నుండి వివిధ హాస్పిటల్స్ లో న్యాయమైన చికిత్స పొందుతున్నారు.అప్పటినుండి ట్రీట్మెంట్ ఖర్చుల అమౌంట్ బిల్స్ ఈహెచ్ సిటికు సమర్పిస్తే వారికి ఈ హెచ్ ఎస్ నుండి డబ్బులు చెల్లించాలని తెలిపారు.హెల్త్ కార్డ్స్ విషయం లో ఆదేశిస్తూ క్రొత్త హెల్త్ కార్డ్స్ వచ్చేవరకు,పాత కార్డ్స్ తో అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ చికిత్స అందచేయాలని,హైదరాబాద్ లోని హాస్పిటల్స్ యాజమాన్యంతో సమావేశం నిర్వహించి వైద్యం అందించటానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సంఘం అధ్యక్షులు వెంకట్ రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. సర్వీస్ పెన్షనర్స్ యొక్క డిపెండెంట్స్,ఫ్యామిలీ పెన్షనర్స్ వారి ఎలిజిబుల్ ఉన్న క్రొత్త వారికి ఈ హెచ్ ఎస్ కార్డ్స్ కొరకు సంబంధిత ఎస్ టి ఓ/ ఏ టి ఓ/ డి టి ఓ కార్యాలములలో అవసరమైన సమాచారముతో అప్లై చేసుకొనుటకు అనుమతించారు.వారికి క్రొత్త కార్డ్స్ ఇవ్వాలి,క్రొత్త కార్డ్స్ వచ్చేవరకు పాత కార్డ్స్ తో చికిత్స అందచేయాలి.ఈ సంఘం టీఎస్ జిఆర్ఈఏ ప్రాతినిధ్యం మేరకు కర్నూల్ , విజయవాడ లలో ఎంప్యానెల్ హాస్పిటల్స్ లో చికిత్స పొందుటకు చేర్చినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు బాలకిషన్ రావు, ఆర్థిక కార్యదర్శి బీసిరెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, సీనియర్ పెన్షనర్ హనుమంతు అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ముఖ్యమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలి...



**జోగులాంబ గద్వాల ఆగస్టు 1( స్కై న్యూస్)** ఎన్నికల్లో విద్యార్థులకు అనేక హామీలు ప్రకటించి గద్దెనెక్కిన తర్వాత ఇంజనీరింగ్ విద్యార్థులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు శనివారం జిల్లా కేంద్రంలోని వైయస్సార్ చౌక్ దగ్గర బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు జోక్యం చేసుకోవడంతో స్వల్ప ఉధృత్తత నెలకొంది అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం దారుణమని మండిపడ్డారు. విద్యార్థులకు చెల్లించవలసిన వేలకోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించకుండా విద్యార్థులను ఇక్కట్లకు గురి చేస్తుందన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వెంటనే యువత విద్యార్థులు ఏకమై పోరాటాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. యువతకు 4 నిరుద్యోగ భృతి విద్యా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకట రాములు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమతా మధు గౌడ్ కౌన్సిలర్ శాలన్న చంద్రశేఖర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి శ్రీను పటేల్ పాండు సాయి సతీష్ లడ్డురాజు పవన్ తదితరులు పాల్గొన్నారు

## తల్లి పాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

**ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ**



**ఉట్కూరు జులై 31 ( స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల పరిధిలోని చిన్న పొర్ల గ్రామంలో శనివారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వార్షికోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్న పొర్ల గ్రామ సర్పంచ్ నికి ప్రశాంత్ మాట్లాడుతూ. తల్లిపాలు శిశువుకు ఉత్తమమైన ఆహారం అని శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించటం వల్ల ఆరోగ్యంగా ఎదుగుదడని పేర్కొన్నారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని అనంతరం పోషకాహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాల ద్వారా శిశువుకు ఆరోగ్య నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఎదుగుతాడని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సుధారాణి. అంగన్వాడీ టీచర్ సుజాత. అరుణ. పద్మావతి.వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలి



**ఉట్కూర్ జులై 1( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఉట్కూరు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ మరియు గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయుటకు వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని నిరుద్యోగులు హెచ్. నర్సింహా,తిరుపతి,వెంకటేష్, లక్ష్మణ్,అశోక్ తదితరులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మరియు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయ పోస్టులు భర్తీ సకాలంలో చేయకపోవడం వలన చాలా మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి పూర్తి కావడం వలన వయోపరిమితి పెంచాలని కోరితే మే 19 తేది నుంచి ఒక సంవత్సరం వరకు 44 సంవత్సరాల వరకు ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలు వ్రాయుటకు నిరుద్యోగులకు అనుమతి ఇచ్చారు. ఇప్పటికే రెండు నెలల పూర్తి అయ్యిందని కావున వయోపరిమితి పూర్తి అవుతున్న నిరుద్యోగులు ఆందోళనల చెందుతున్నారని తెలిపారు . వెంటనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ధాన్యం బకాయిలను చెల్లించాలి

**బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన పోలీసుల జోక్యంతో ఉద్రిక్తత**

**సొమ్మసిల్లిన సిరికొండ శ్రీనివాస్**





**వేములవాడ ఆగస్టు 1( స్కై న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించకపోవడం దారుణమని వెంటనే వారికి చెల్లించవలసిన ధాన్యం బకాయిలను పూర్తిగా చెల్లించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు శనివారం పట్టణంలోని తెలంగాణ చౌక్ లో వడ్లను రోడ్డుపై పోసి ఆందోళనకు దిగారు. సీఐ వీర ప్రసాద్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్న పోలీసులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వారిని అడ్డుకోవడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది సందర్భంగా జరిగిన పెనుగులాటలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ సొమ్మసిల్లిపోయారు వెంటనే ఆయనను పట్టణమును ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు సందర్భంగా పోలీసులు నాయకులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు చెల్లించవలసిన ధాన్యం డబ్బులను చెల్లించాలని శాంతియుతంగా ఆందోళన వ్యక్తం చేస్తే పోలీసులు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆందోళనను అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహస్తులు చేసేలా శాంతితా ఉద్యమాలను అణిచివేస్తున్నారని మండిపడ్డారు

## యువత గొంతును అణిచివేయడం అప్రజా స్వామీకం...

**అణిచివేస్తే ఉద్యమం తీవ్రతరం**

**బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి శాంతి కుమార్**



**మహబూబ్ నగర్ ఆగస్టు 1( స్కై న్యూస్)** ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని విద్యార్థులు యువత శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే పోలీసులతో ప్రభుత్వం లాఠీచార్జి చేయించి ప్రశ్నించే గొంతును అణిచివేయడం అప్రజాస్వామీకమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి శాంతి కుమార్ మండిపడ్డారు శనివారం జిల్లా కేంద్రంలో బిజెపి మరియు బిజెపి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తే పోలీసులు ఇష్టారాజ్యంగా లాఠీచార్జి చేసి అక్రమంగా అరెస్టు చేయడం జరిగిందని ప్రశ్నించే గొంతుకులను అనిచివేయడమే ప్రజా పాలన అని ఆయన నిలదీశారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు ఆందోళనలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సాధారణమేనని ప్రభుత్వం దాన్ని కూడా తట్టుకోలేక ఈ విధంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు పోలీసు బలాలతో ఆందోళన అడ్డుకుంటే అన్ని సంఘాలతో కలిపి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రతిపక్షాలు ప్రజా సంఘాలు చేస్తున్న ఆందోళనకు ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలి తప్ప అణిచివేయడం తగదన్నారు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వార్తాతరంగాలు ఆదివారం 02 ఆగస్టు 2026

## సేవా కార్యక్రమాలతో జన్మ సార్థకత

**విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి పాలాది సాయిబాబా.**



**నాగర్ కర్నూల్ ఆగస్టు1( స్కై న్యూస్)** ఆర్థిక ప్రయోజకులుగా మారిన ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావడం వల్ల జన్మకు సార్థకత ఏర్పడుతుందని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి పాలాది సాయిబాబా అన్నారు శనివారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యార్థం గోడ గడియారని ఏర్పాటు చేశారు. ఆయన ఆర్టీసీ ఉద్యోగులకు దానిని అందించి ప్రయాణికులకు సమయాన్ని తెలియజేసే విధంగా ఉంచాలని కోరారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సేవా కార్యక్రమాల ద్వారా గుర్తింపు లభిస్తుందని తాను కూడా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జన్మించిన గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అదేవిధంగా పట్టణ క్లబ్ అధ్యక్షులుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఇతరులకు సాయం అందించినప్పుడే సంపాదించిన ప్రతి రూపాయకు విలువ ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్టిసి ఉద్యోగులు పాల్గొన్నారు

## సయ్యద్ షఫీ మృతిపై రవీందర్ యాదవ్ సంతాపం



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 1 (స్కై న్యూస్):** కొత్తూర్ మండలం ఇన్ముల్ నర్వ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రషీద్ సోదరుడు సయ్యద్ షఫీ ప్రమాదవశాత్తు మృతి చెందడం బాధాకరమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న రవీందర్ యాదవ్ మృతుడి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబానికి భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలిత గోపాల్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు పెంటనోళ్ల యాదగిరి, తస్లీమ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు..



**వేములవాడ ఆగస్టు1 (స్కై న్యూస్):**రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ శనివారం వేములవాడ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో అందించే సేవలకు సంబంధించిన రుసుముల పట్టికను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ సర్టిఫికేట్, కాలుష్య నియంత్రణ సర్టిఫికేట్, ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల పేర్లు, సిబ్బంది అర్హత పత్రాలు, ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు.స్కానింగ్ సెంటర్లలో గర్భిణులకు సేవలు అందించే సమయంలో ్రాజూచీణు చట్టం నిబంధనలను కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, శిశువు లింగాన్ని వెల్లడించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. స్కానింగ్ చేసే గది, వేచి ఉండే హాలులో “ఇక్కడ లింగ నిర్ధారణ చెప్పబడదు” అనే బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ఫారం-ఎఫ్‌ను అదే రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రతి నెల 5వ తేదీలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు.అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెండు డయాగ్నస్టిక్ సెంటర్లను గుర్తించి వాటి యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు.ఈ తనిఖీల్లో సెక్షన్ ఇన్‌చార్జ్ మహేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కష్టతరంగా మారిన రేషన్ కార్డు కేవైసీ విధానం...

**గురుకుల, సంక్షేమ హాస్టల్ల దగ్గరనే విద్యార్థుల ఈ కేవైసీ ని పూర్తి చేయాలి.**

**జె.వెంకటపతి రాజు పుడమి ఫౌండేషన్ చైర్మన్**



**మక్తల్ ఆగస్టు 1 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ముక్తల్ మండల్ నియోజకవర్గంలో రేషన్ కార్డుల కేవైసీ సంబంధించిన వివరాలు ఈనెల చివరి వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిన విషయం అందరికీ తెలిసిందే. కానీ ఈ కేవైసీ పూర్తి చేయడం కోసం ఇతర ప్రాంతాలలో వివిధ గురుకుల పాఠశాలలో మరియు సంక్షేమ హాస్టల్లో చదువుకుంటున్న అనేక మంది విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురుకులాల నుండి ఒకేసారి పిల్లలను పంపించడం కుదరదని పాఠశాల ప్రిన్సిపల్ చెప్తున్నారు. కావున పిల్లల చదువులకు అంతరాయం కలగకుండా ఒకే దగ్గర ఉంటున్న వందలాది మంది పిల్లల దగ్గరికి అక్కడ అందుబాటులో ఉన్న రేషన్ డీలర్లను ఈ కేవైసీ పూర్తి చేయడం కోసం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.ప్రభుత్వం వీటిపై వెంటనే స్పందించి తగు నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఇట్టి కార్యక్రమంలో చైర్మన్ జె. వెంకటపతి రాజు. పుడమి ఫౌండేషన్ ఉపాధ్యక్షులు రవికుమార్. శ్రీనివాస్. కోరిపవన్. దేవకినందన్. అరవింద్. సాయివిశాల్. నాని. తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి

**: ప్రభుత్వ వైద్య అధికారి శిరీష**



**చిన్న చింతకుంట ఆగస్టు 1 (స్కై న్యూస్)** చిన్న చింతకుంట మండల పరిధిలోని వివిధ గ్రామాలలో వర్షాలు బాగా కురుస్తున్నాయి, కాబట్టి సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఛాంబర్ లో డాక్టర్ శిరీష మీడియా ముందు శనివారం మాట్లాడుతూ ఇంటి ముందు పరిసరాలలో చెత్త చెదారం లేకుండా వర్షపు నీరు ఆగకుండా చూడాలి అన్నారు. ఏవైనా లబ్బర్ టైర్లు పాత కుండలు కొబ్బరి చిప్పలు ఉండకుండా చూడాలి అన్నారు. ఇంటి ముందు హౌస్లలో నీళ్లు నిలువ చేసుకోకూడదు అన్నారు. ప్రతిరోజు నీళ్లు మరగబెట్టుకుని తాగడం చాలా మంచిది అన్నారు. సాయంత్రం వేళ్లలో దోమలు ఇంటిలోకి వస్తాయి కనక కిటికీలు తలుపులు మూసుకొని ఉండాలి అన్నారు. నిద్రపోయే ముందు దోమతెరలు తప్పనిసరిగా వాడాలని అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు.

# బద్లావ్ జరూరి హై’ నినాదంతో ఊరూరా నిరసనగళం

**ఆగస్టు 6 నుంచి జిల్లాలో ప్రజాచైతన్య యాత్రలు**

**ప్రజావ్యతిరేక విధానాలపై ఊరూరా నిరసనగళం**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**ప్రచార గోడప్రతులను విడుదలచేసిన సిపిఐ జిల్లా బృందం**




**కొత్తగూడెం ఆగస్ట్ 1( స్కై న్యూస్) :** ప్రజావ్యతిరేక విధానాలపై ఊరూరా నిరసనగళం విన్పిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఆగష్టు 6వ తేదీ నుంచి వారం రోజుల పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తెలిపారు. శనివారం కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం ‘శేషగిరి భవన్’లో యాత్రకు సంబంధించిన ప్రచార గోడప్రతులు, కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ‘బద్లావ్ జరూరి హై - మార్పు కావాలి’ నినాదంతో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. పాలకులు నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని, దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందడం లేదని, పంటలకు కనీస మద్దతు ధర చట్టబద్ధత లేక రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని మండిపడ్డారు. ఈవీఎంల నిర్వహణపై అనుమానాలు ఉన్నందున భవిష్యత్తు ఎన్నికలను బ్యాలెట్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల నిరుద్యోగులు నిరాశలో కూరుకుపోతున్నారన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలులో కాలయాపన చేయడం, కార్మిక చట్టాలను సవరిస్తూ కార్మికుల హక్కులను హరించడం, దళితులు, గిరిజనులపై దాడులు పెరిగిపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. అదేవిధంగా భద్రాద్రి జిల్లాలో ప్రధాన సమస్యలైన పోడు భూములకు పట్టాలు అందక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం, సీతారామ ప్రాజెక్టు జలాలు రైతాంగానికి అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులకు భద్రత, సంక్షేమ చట్టాలు లేక కనీస వేతనాలు అమలుకు నోచుకోవడం లేదని, భూ నిర్వాసితులకు సమగ్ర పరిహారం చెల్లించడంలో పాలకులు అలసత్వం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిర్వహించే యాత్రలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నారాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, ఎస్ డి సలీం, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, మున్నా లక్ష్మీకుమారి, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, కంచర్ల జమలయ్య, రేసు ఎల్లయ్య, వాసిరెడ్డి మురళి, ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, దేవరకొండ శంకర్, ఎస్ కె ఫహీం, మువ్వ వెంకటేశ్వర్లు, మండల, పట్టణ కార్యదర్శులు, ప్రజాసంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## MJPVC ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ఉపన్యాస పోటీ కార్యక్రమం ప్రచార పత్రం విడుదల




**మక్తల్ జులై 31( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా మక్తల్ మండల్ లో మందిపల్ యాంకే పద్మ శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో మక్తల్ రాఘవేంద్ర కాలనీలో ఎం జె పి వి సి ఆధ్వర్యంలో యాంకే పద్మ వీభీఎజ మక్తల్ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు మరియు సంగోల అశోక్ కుమార్ వీభీఎజ మక్తల్ నియోజకవర్గం అధ్యక్షులు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ఉపన్యాస పోటీ కార్యక్రమం ప్రచార పత్రం విడుదల చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీభీఎజ నారాయణపేట జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి విజయకుమార్ హాజరవడం జరిగింది విశిష్ట అతిథులుగా కలబంద బసవరాజు ఎం జె పి వి సి నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షులు హాజరువ్వడం జరిగింది అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గం పరిధిలో పర్యావరణ పరిరక్షణ ఉపన్యాస పోటీ కార్యక్రమం చాలా అద్భుతమైనది అని ఆయన కొనియాడారు అలాగే నేడే జరుగుతున్న ఎలినో ప్రభావాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక విద్యార్థిని విద్యార్థులను ఈ ఉపన్యాస పోటీ కార్యక్రమంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థిని విద్యార్థినిలకు పిలుపునివ్వడం జరిగింది అలాగే ప్రతి ఒక్కరు కూడా పర్యావరణ పై అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు ఉజ్జెల్లి కలబంద బసవరాజు మాట్లాడుతూ పర్యావరణం కాపాడడంలో ప్రతి ఒక్కరు చెట్లు నాటాలని ఆ చెట్లను సంరక్షించడంలో ముందుండాలని ప్రతి ఒక్కరిని కోరారు దాసరపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక విద్యార్థిని విద్యార్థినిలు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కలిగి ఉండాలని రానున్న కాలంలో కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ రానున్న కాలంలో వర్షాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండడానికి ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థినీలి చెట్లు నాటాలని ఆయన అన్నారు ఊట్కూర్ శివ శంకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని అలాగే పర్యావరణ పరిరక్షణ అనేది ప్రజలపై ఏ విధంగా ప్రభావితం చేస్తుందో ఈ కార్యక్రమంలో తెలుసుకోవాలని ఆయన అన్నారు హాజీ బాబా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా మా వీభీఎజ ఆధ్వర్యంలో 30/8/2026 ఆదివారం నిర్వహించే పర్యావరణ పరిరక్షణ ఉపన్యాస పోటీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ కృష్ణ మండలం మాగనూరు మండలం మక్తల్ మండలం ఊట్కూరు మండలం నర్వ మండలం లోని విద్యార్థిని విద్యార్థులు పాల్గొనాలని అజి బాబా పిలుపునిచ్చారు అనంతరంవీభీఎజ నాయకులుప్రచార పత్రాన్ని విడుదల చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కొత్తపల్లి విజయకుమార్ ఎంజెపివిసి నారాయణపేట జిల్లా అధ్యక్షులు ఉజ్జెల్లి కలబంద బసవరాజ్ ఎం జె పి వి సి నారాయణపేట ఉపాధ్యక్షులు మంది పల్లె యాంకే పద్మ ఎం జె పి వి సి మక్తల్ నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు సంగోల అశోక్ కుమార్ ఎం జె పి వి సి మక్తల్ నియోజకవర్గం అధ్యక్షులు ఎండి హాజీ బాబా ఎం జె పి వి సి నాయకులు కె.వి గణేష్ ఎం జె పి వి సి కృష్ణ మండల అధ్యక్షులు దాసరపల్లి ఆంజనేయులు ఎం జె పి వి సి మక్తల్ మండల అధ్యక్షులు ఊట్కూరు శివశంకర్ ఎం జె పి వి సి ఊట్కూరు మండల అధ్యక్షులు దాసరపల్లి రాము ఎం జె పి వి సి నాయకులు కెవి నరసింహ వీభీఎజ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లేపల్లి మల్లేష్ ఎం జె పి మిషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ వెంకట రమణ






**సింగరేణి ఆగస్ట్ 1( స్కై న్యూస్):**కొత్తగూడెం ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా సీహెచ్ వెంకట రమణ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, నూతన జనరల్ మేనేజర్‌కు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం సీహెచ్ వెంకట రమణ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాల సాధన, కార్మికుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమష్టి కృషితో కొత్తగూడెం ఏరియాను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఏరియాలోని గనులు, అనుబంధ విభాగాల్లో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఉత్పాదకత పెంపునకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేసి సంస్థ ప్రగతికి తమవంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం ఎం. గోవిందరావు ఏజీఎం (ఫైనాన్స్) బిబత్స ,ఏజీఎం (సివిల్) సి.హెచ్. రామకృష్ణ ,డీజీఎం (ఐఈడీ) యోహాన్ , ఏరియా ఇంజనీర్ -- వి. రామకృష్ణ , సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు ,సీఎంఓఏఐ) జనరల్ సెక్రటరీ ఉపేందర్ , పర్సనల్ మేనేజర్ తిరుపతి సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ తౌర్యా , కె. రాజారాం , వీకేసీమ్ మేనేజర్ మురళి , డీజీఎం స్టోర్స్ మైనేని శ్రీనివాస్ ,ఇతర విభాగ అధికారులు, ఉద్యోగులు, పాల్గొని నూతన జనరల్ మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## సిపిఐ పాదయాత్రలను విజయవంతం చేయాలి

**ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలి**



**నాగర్ కర్నూల్ ఆగస్టు 1( స్కై న్యూస్)** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజలను ఏకం చేసేందుకు ఈనెల 6 నుండి 14 వరకు సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్రలో నిర్వహిస్తున్నట్లు వాటిని విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ కోరారు శనివారం జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవనంలో సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధ్యయనం చేసి వాటిని పరిష్కరించేందుకు చేసే కార్యక్రమాలలో భాగంగానే పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించాలని సార్వత్రిక విద్యా ఆరోగ్యం అందుబాటులోకి తీసుకురావాలని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని దళిత ఆదివాసులపై జరుగుతున్న అకృత్యాలను దాడులను నిలిపివేయాలని ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిరుద్యోగం తగ్గించేందుకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నిర్వహించే ప్రజల జరూర్ హై మార్పు వచ్చే అవసరం ర్యాలీతో ముగుస్తాయని తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఆనంద్ జి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వార్ల వెంకటయ్య కేశవులు గౌడ్ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రమౌళి నాయకుల కృష్ణాజీ మారేడు శివశంకర్ వెంకటయ్య శంకర్ గౌడ్ రామస్వామి భూపేష్ మధు గౌడ్ స్వామి తదితరులు పాల్గొన్నారు

# ఆపరేషన్ ముష్కాన్ విజయవంతం

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట ఆగస్టు 1: (స్కైన్యూస్)**నారాయణపేట జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూ లన లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్--శ×× విజయ వంతంగా పూర్తయిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఆపరేషన్ స్మైల్ , ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తు న్నామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన, వదిలివేయ బడిన బాలలను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చడంతో పాటు, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, పరిశ్రమలు, ఇతర వాణిజ్య సంస్థలు మరియు రోడ్లపై భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తించి రక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. అవసరమైతే బాలలను సంబంధిత స్టేట్ హోమ్‌లకు తరలిస్తూ, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు.ఆపరేషన్ముస్కాన్--శ××లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించి మొత్తం 61 మంది బాల కార్మికులను



పట్టుకొని వీరిలో 59 మంది బాలురు, ఇద్దరు బాలికలు ఉన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై మొత్తం 32 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, నిబంధనలు ఉల్లంఘించిన నలుగురు యజమానులకు రూ.27,000 జరిమానా విధించినట్లు ఎస్పీ వెల్లడిం చారు.విముక్తి చేసిన బాలలకు, వారి తల్లిదండ్రు లకు బాలల హక్కులు, నిర్బంధ విద్య, బాల కార్మిక వ్యవస్థ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి, తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ శాఖ, విద్యాశాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, వైద్య ఆరోగ్య శాఖ తదితర ప్రభుత్వ శాఖల సమన్వ యంతో విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నా రు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించా లంటే ప్రజల సహకారం ఎంతో అవసరం. చిన్నారు లను పనుల్లో పెట్టకుండా విద్యాబాట పట్టించడం ద్వారా వారి భవిష్యత్తును సురక్షితం చేయవచ్చు అని అన్నారు.ఎక్కడైనా బాలల ను పనిలో పెట్టుకున్నా, బాల కార్మికులు కనిపిం చినా, తప్పిపోయిన లేదా వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్-- 1098 లేదా డయల్-- 100కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.ఆపరేషన్ ముస్కా న్--శ×× కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పోలీసు శాఖతో సమన్వ యంగా పనిచేసిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారు లు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# నవజాత శిశువుకు తల్లిపాలే రక్షణ కవచం

**జిల్లా సంక్షేమ అధికారిని జె. స్వర్ణలత లేనినా**

**కొత్తగూడెం ఆగస్ట్ 1( స్కై న్యూస్ ):** బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలలు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని, ఆ తర్వాత మరో సంవత్సరం పాటు తల్లిపాలు ఇవ్వడం తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణకు రక్షణ కవచం లాంటిదని జిల్లా సంక్షేమ అధికారిని జే స్వర్ణలత లేనినా పేర్కొన్నారు. స్థానిక భద్రాద్రి కొత్తగూడెం బస్టాండ్ లోని తల్లి



పాలిచ్చే గదిని లాంఛనంగా ప్రారంభించి బాలింతలకు తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిని మాట్లాడుతూ ప్రసవించిన మొదటి గంటలోపే తల్లిపాలు ఇవ్వడాన్ని ప్రారంభించేలా తల్లులకు సహకారం అందించాలని, తల్లిపాలే నవజాత శిశువును అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయని, బిడ్డ పుట్టినప్పటి నుండి ఆరు నెలల నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించడం, ఈ ఆరు నెలల్లో బిడ్డ ఎదుగుదల మరి అభివృద్ధికి అవసరమైన పోషకాలన్ని తల్లిపాలలోని లభిస్తాయని, ఇలాంటి ఇతర పదార్థాలు తినిపించకుండా, త్రాగించకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నప్పుడు మాత్రమే తల్లి బిడ్డల ఆరోగ్య భద్రత ఉంటుందని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా బిడ్డ పుట్టిన వెంటనే తేనే, పంచదార లాంటి మూఢనమ్మకాలు నమ్మకుండా ముర్రుపాలె ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అర్బన్ సిడిపిఓ, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, మహిళా సాధికారిత జిల్లా బృందం, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆర్టీసీ సిబ్బంది, బాలింతలు తదితరులు పాల్గొన్నారు

# నానో యూరియా అమ్మకాలు పెరగాలి

## రైతులు ఆరుతడి పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జోగులాంబ గద్వాల,ఆగస్టు1స్కై న్యూస్):**యూరియాను అధిక మొత్తంలో వినియోగిస్తుండడంతో వ్యవసాయ క్షేత్రాలు సారవంతతను కోల్పోతున్నాయని, అన్నదాతలు నానో యూరియా ఎక్కువగా వినియోగించేలా వాటి అమ్మకాలను పెంచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని వెంకటరమణ పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్,. సీడ్స్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల విత్తనాలు, ఎరువుల విక్రయాలు, వాటి ధరల గురించి దుకాణ యజమానిని అడిగారు. వివిధ స్టాక్ రిజిస్టర్ లను, పలు కూరగాయల విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. యూరియాను ఆన్లైన్లో బుక్ చేస్తుండడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. రైతులు ఎక్కువగా నానో ఏరియా వినియోగించేలా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్





నినో నేపథ్యంలో వర్షాలు తక్కువగా కురుస్తుండడంతో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలైన కందులు, కూరగాయలు, తదితర సాగుపై ఎక్కువగా దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. పెస్టిసైడ్స్, సీడ్స్, ఫర్టిలైజర్స్



దుకాణాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఏడిఏ సుబ్బారెడ్డి, ఏవో సురేష్ గౌడ్, ఏఈఓ నరేష్, తదితరులున్నారు.

# జయం ని మర్యాదపూర్వకంగా కలిసిన రత్నకుమార్

**కొత్తగూడెం ఆగస్ట్ 1( స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం సింగరేణి ఏరియా నూతన జనరల్ మేనేజర్ గా సిహెచ్.వెంకటరమణ నియమంతులైనరు . ఈ సందర్భంగా ఆగస్టు ఒకటి శనివారం జిఎం కార్యాలయంలో జి ఎం గా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణ. ఈ





సందర్భంగా జిఎం ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వార్త తరంగాలు స్టాఫ్ రిపోర్టర్ రత్న కుమార్.

# ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవీ విరమణ అనంతరం సామాజిక సేవ చేయాలి

**డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**

**పాల్వంచ కె.టి.పి.ఎస్ లో పలువురు రిటైర్మెంట్ ఉద్యోగ విరమణ లో పాల్గొన్న కొత్వాల, కార్పొరేటర్ విమలదేవి**

**పాల్వంచ ఆగస్ట్ 1( స్కై న్యూస్):**ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవి విరమణ అనంతరం సమాజ సేవ చేస్తూ అందరికీ సహాయ పడాలని డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ కె.టి.పి.ఎస్ 5, 6 దశలలోని



7 వ దశలోని ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. కె.టి.పి.ఎస్ 5, 6 దశల్లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గా పని చేస్తున్న పర్వత రామారావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేస్తున్న కొల్లు వెంకటేశ్వరరావు, 7వ దశలో 1గ్రేడ్ ఫోర్ మెన్ గా పనిచేస్తున్న సముద్రాల రాంబాబు, 2 గ్రేడ్ ఫోర్ మెన్ గా పనిచేస్తున్న సయ్యద్ యాకూబ్, ప్లాంట్ అటెండెంట్ గా పనిచేస్తున్న చిటికెన నాగేశ్వరరావు, శుక్రవారం రాత్రి పదవి విరమణ పొందారు. వీరి పదవీ విరమణ సందర్భంగా కె.టి.పి.ఎస్ కర్మాగారాల్లో జరిగిన రిటైర్మెంట్ ఫంక్షన్ లో కొత్వాలతో పాటు 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలదేవి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఉద్యోగులు సంపాదించిన దానిలో కొంతమేర తోటి వారికి సహాయ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, పలువురు ఇంజనీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

# పుట్టిన శిశువుకు తల్లిపాలే శ్రేష్టకరం ఏఎన్ఎం గౌసియా

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 1 (స్కై న్యూస్):** మల్దకల్ (సద్దలోని పల్లి): జన్మించిన శిశువులకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే శ్రేష్టకరమని ఏఎన్ఎం గౌసియా అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని సద్దలోనిపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో ఏఎన్ఎం గౌసియా పాల్గొని మాట్లాడుతూ ప్రసవం జరిగిన వెంటనే తల్లి



ముర్రుపాలు బిడ్డకు అందడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, తల్లిపాలతో పాటు పోషకాహారం అందివ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆగస్టు 1 నుండి7 వరకు తల్లిపాలు వారోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్వాడి టీచర్ బాలింత తల్లులకు గర్భిణులకు సూచనలు తెలియజేశారు.

1. పుట్టిన వెంటనే గంటలోపు తల్లిపాలు ఇవ్వాలి
2. 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి
3. తల్లి నుండి వచ్చే మొదటి పసుపు రంగు చిక్కని పాలు – "కొలొస్ట్రమ్" బిడ్డకు అమృతంతో సమానం
4. తల్లి అనారోగ్యంగా ఉన్నా సరే బిడ్డకు పాలు ఇవ్వవచ్చు
5. తల్లిపాలు ఇవ్వడం వలన తల్లికి గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశం తగ్గుతుంది..........
6. 2 సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందించడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది, పోషకాహార లోపం తగ్గుతుంది అని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు

# జిల్లా పోలీసుల వీక్లీ పరేడ్ :ఆర్ ఐ నరసింహ

**నారాయణపేట ఆగస్టు 1: (స్కైన్యూస్)** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఆర్ఐ నరసింహ ఆధ్వర్యంలో వారాంత పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన, శారీరక దారుఢ్యం, వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరిచే ఉద్దేశంతో వివిధ రకాల డ్రిల్ కార్యక్రమాలు నిర్వహించారు.పరేడ్‌లో భాగంగా పోలీసు సిబ్బందికి యూనిఫాం నీట్ టర్న్‌అవుట్, ఫుట్ డ్రిల్, ఆర్మ్స్ డ్రిల్, వెపన్స్ హ్యాండ్లింగ్, కవాతు విధానాలు, ఆదేశాల అమలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతి పోలీసు సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేలా ఇలాంటి పరేడ్‌లు ఎంతో



ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్ఐ నరసింహ మాట్లాడుతూ... పోలీసు శాఖలో క్రమశిక్షణ అత్యంత కీలకమని అన్నారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. యూనిఫాం పరిశుభ్రత, విధి నిర్వహణలో నిబద్ధత, ఆయుధాల నిర్వహణలో నైపుణ్యం, శారీరక దృఢత్వం ప్రతి పోలీసుకు తప్పనిసరి లక్షణాలని పేర్కొన్నారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా వృత్తి నైపుణ్యాన్ని నిరంతరం పెంపొందించుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మరికల్ సీఐ భగవంత్ రెడ్డి, ఆర్ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐలు రమేష్, విజయ్ కుమార్, సతీష్ రెడ్డి, శివ శంకర్, శ్వేత, శిరీష, మహేశ్వరి, సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు మరియు హోమ్ గార్డ్స్ పాల్గొన్నారు.

# మోడిఫైడ్ సైలెన్సర్లతో తిరుగుతున్న ద్విచక్ర వాహనాలు

## ప్రత్యేక తనిఖీలు చేపట్టిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ట్రాఫిక్ పోలీసులు

**కొత్తగూడెం ఆగస్టు 1( స్కై న్యూస్ ):**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చుకున్న ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో మొత్తం 12 ద్విచక్ర వాహనాలు మోడిఫైడ్ సైలెన్సర్లతో నడుస్తున్నట్లు గుర్తించి, ఆయా వాహనదారులపై మోటారు వాహనాల చట్టం--1988 సెక్షన్ 190(2) ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించి వసూలు చేశారు. అనంతరం అన్ని వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి పోలీస్ స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్హెచ్ఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మోడిఫైడ్ సైలెన్సర్ల వినియోగం వల్ల తీవ్రమైన శబ్ద కాలుష్యం ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని, ఇటువంటి మార్పులు చట్టవిరుద్ధమని



తెలిపారు. వాహనదారులు కంపెనీ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై జిల్లా



వ్యాప్తంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎన్నికల హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.. వీర్లపల్లి గ్రామ ప్రజలకు త్వరలో ఫ్లాట్లు

**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని. ఆగస్టు 1(స్కై న్యూస్):** రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వీర్లపల్లి గ్రామ ప్రజలతో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో వీర్లపల్లి గ్రామ ప్రజలకు ఇచ్చిన పునరావాస హామీని తప్పకుండా నెరవేర్చుతానని చెప్పిన మాటను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ ప్రభావంతో వీర్లపల్లి గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం గానీ, ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం గానీ గ్రామానికి పునరావాసం కల్పించే విషయంలో సరైన చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో కూడా పలుమార్లు సమావేశమై వీర్లపల్లి గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు చేపట్టామని చెప్పారు. వీర్లపల్లి గ్రామంలోని 250కి పైగా



కుటుంబాలకు ఫ్లాట్లు నిర్మించి అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఫ్లాట్ల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కూడా ఇప్పటికే పరిశీలించినట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణ ప్రక్రియ ప్రారంభించి అర్హులైన ప్రతి కుటుంబానికి ఫ్లాట్లు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు 21వ డివిజన్ కార్పొరేటర్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు కొక్కిరాల శ్రీనివాస్, వీర్లపల్లి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పునరావాస సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వార్తాతరంగాలు
ఆదివారం 02 ఆగస్టు 2026

## నిరుద్యోగులను కించపర్చ డాన్ని నిరసిస్తూ పేటలో సి ఎం దిష్టి బొమ్మ దగ్ధం



**నారాయణపేట ఆగస్టు 1: (స్కై న్యూస్):** నిరుద్యోగుల కోసం, విద్యా ర్థుల ఫీజు రియంబర్స్మెంట్ కోసం పోరాడుతున్న నిరుద్యోగులను సి ఎం రేవంత్ రెడ్డి క్రిమినల్స్ అంటూ,అడ్డా మీది కూలీలు అంటూ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో సి ఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు.ఈ కార్యక్రమంలో బి జె వై ఎంజిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రి స్థాయిలో ఉండి విద్యార్థులను క్రిమి నల్స్ అనడం సిగ్గుచేటు అని అన్నారు, రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాల ని, హామీ ఇచ్చినట్లుగా 2 లక్షల ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రసిడెంట్ మణిశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్, మణి మోడీ, ప్రకాష్, చేతన్, శ్రీకాంత్, అరవింద్, అన్వేష్, పోలమోని శివ,కురుమూర్తి యాదవ్, చక్రి, చరణ్దాస్, రవి, వెంకటేష్, సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు .

## పేట జిల్లాలో పెన్ డౌన్ విజయవంతం




**నారాయణపేట ఆగస్టు 1: (స్కైన్యూస్)** పే స్కేల్‌ను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా ఉపాధి హామీ ఉద్యోగులు శనివారం జిల్లా డి ఆర్ డి ఎ కార్యాలయం ఎదుట పెన్‌డౌన్ నిర్వహించి శాంతి యుత నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, పే స్కేల్‌ను ప్రకటించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగు తున్న ఉద్యమంలో భాగం గా నారాయణపేట జిల్లా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటారు."పే స్కేల్ మా హక్కు -- వెంటనే ప్రకటిం చాలి!" అనే నినాదాలతో ఉద్యోగులు ప్రభుత్వ దృష్టిని ఆకర్షించారు.

## సర్ గడువు మరోసారి ఆగస్టు 10 వరకు పొడిగింపు

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్, ఆగస్టు01 (వార్త తరంగాలు):** ఓటర్ ప్రత్యేక సవరణ గడువును ఆగస్టు10 వరకు ఎన్నికల సంఘం పొడిగించిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. అర్హత గల ఓటర్లు అందరూ సర్ లో నమోదు చేసుకొని, అనర్హులు,మరణించిన వారు,ఒకే ఓటరు రెండు సార్లు ఓటరు గా నమోదు అయిన వారిని తొలగించాలన్నారు.సర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి 100 శాతం సర్ నమోదు చేయాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**సవరించిన సర్ షెడ్యూల్**

ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సమర్పణకు చివరి తేదీ: 10-08-2026 పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ మరియు పునర్వ్యవస్థీకరణ: 10-08-2026 ముసాయిదా ఓటరు జాబితాల ప్రచురణ: 17-08-2026 క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల స్వీకరణ కాలం: 17-08-2026 నుండి 16-09-2026 వరకు క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కారం (నోటీసు కాలం): 17-08-2026 నుండి 15-10-2026 వరకు తుది ఓటరు జాబితాల ప్రచురణ: 19-10-2026 ఉంటుందన్నారు.

## తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం

**హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు**




**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 1: (స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని షాద్‌నగర్ "ఏ" సబ్‌సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని అయన అన్నారు. శిశువు పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలు



ప్రారంభించి, తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాల వల్ల శిశువుకు పోషకాలు, రోగనిరోధక శక్తి లభించి అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. అలాగే తల్లులకు కూడా ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని, ముర్రుపాలను తప్పనిసరిగా ఇవ్వాలని, తొలి ఆరు నెలలు నీరు లేదా ఇతర ఆహారం ఇవ్వకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జయమ్మ, ఏఎన్ఎం ఇస్తేరు రాణి, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## చౌరస్తా విస్తరణ పనులు వేగవంతం.. మట్టిని తొలగించిన మున్సిపల్ సిబ్బంది



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 1: (స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇటీవల ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో శనివారం మున్సిపల్ సిబ్బంది మెట్ల శిథిలాలు, మట్టిని తొలగించి స్థలాన్ని చదును చేసే పనులు చేపట్టారు. చౌరస్తా విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

# నేరాల నియాత్రణకు గ్రామాల్లో విజిబుల్ పోలిసింగ్ పై దృష్టి సారించాలి

**ప్రజలకు మరింత చేరువగా పోలీస్ విధులు ఉండాలి.**

**మత్తు పదార్థాలు, సైబర్ నేరాల నివారణకు గ్రామీణ యువతలో చైతన్యం పెంపొందించాలి.**

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే..**

**నేరాల నియంత్రణే లక్ష్యంగా గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు,**

**ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువయ్యేలా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులకు సూచించారు.**

**వేములవాడ ఆగస్టు1 (స్కై న్యూస్)** శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఎస్పీ గారు పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారు ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్లు పరిశీలించి అభినందించారు. ఈసందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు,పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులను ఆదేశించారు.కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు,సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని తెలిపారు.పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు.విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, విపివోలు గ్రామాల్లో పర్యటిస్తూ



ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం చేరేలా సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. అలాగే గ్రామీణ ప్రాంత ప్రజలకు, యువతకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.బ్లూ కోల్ట్, పెట్రోకార్ సిబ్బంది గ్రామాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి అనుమానితులు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు




పాల్పడే వారిపై నిరంతర నిఘా ఉంచి తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నేను సైతం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో వాటి పాత్రను తెలియజేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు.ఎస్పీ గారి వెంట డిఎస్పీ శ్రీనివాసులు , సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ వెంకట్రాజం, సిబ్బంది పాల్గొన్నారు.

# హైదరాబాద్ మహా ధర్నాకు భారీగా తరలిన తపస్ శ్రేణులు

**ఉద్యమిస్తేనే ప్రభుత్వం స్పందిస్తుంది**

**మండల అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, రాకేష్**

**మక్తల్ ఆగస్టు1( స్కై న్యూస్ ):** నారాయణపేట జిల్లా మక్తల్ గత అనేక సంవత్సరాలుగా పెండింగులో ఉన్న ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికై తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు హైదరాబాదులో మహాధర్నా కార్యక్రమానికి శనివారం మక్తల్ నుండి ఉపాధ్యాయ శ్రేణులు భారీగాతరలి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శులు రవీందర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నరసింహ, రాకేష్ గౌరవ అధ్యక్షులు నర్సిరెడ్డి లు మాట్లాడుతూ ప్రభుత్వానికి



అనేకసార్లు పెండింగ్ సమస్యలను విన్నవించినప్పటికీ పరిష్కారం చేయనందుకే ఉద్యమ బాట పట్టవలసినదని తెలిపారు.ధర్నా కు పోయిన వారిలో తపస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగార్జున, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్ రాములు, ప్రహ్లాద్ మాగనూర్ అధ్యక్ష కార్యదర్శులు బాబు రెడ్డి, సురేష్,క్రిష్ణ అధ్యక్ష కార్యదర్శులు రమేష్, మోహన్ మక్తల్ మండల తపస్ బాధ్యులు అంజనే యులు, వెంకటయ్య,రామాంజనేయులు, రాముగౌడ్, రాజంజనేయులు, అనిల్ రెడ్డి, జగదీశ్, రవీందర్ రెడ్డి, ప్రవర్ధన్ రెడ్డి,సురేష్,రాములు, నరేందర్, అశోక్ గౌడ్, శివరాజ్,కుబేర నర్సింహా, వెంకటేష్, సోంనాథ్, రవి,రాకేష్, నవీన్, మల్లేష్, నర్సిములు మహిళా ఉపాధ్యాయులు వీణ, జ్ఞానేశ్వరి, స్వరూప, విజయశ్రీ, భారతి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 1 (స్కై న్యూస్):** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన మహాధర్నాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొని ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసి పీఆర్సీ, డీఏ బకాయిల విడుదల, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు, హెల్త్ కార్డు ద్వారా నగదు రహిత వైద్యం, బదిలీలు, పదోన్నతులు, ఖాళీ పోస్టుల భర్తీ వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ నిర్లక్ష్యం వల్ల విద్యా వ్యవస్థ




దెబ్బతింటోందని విమర్శించిన ఆయన, జాతీయ విద్యా విధానం--2020ను తెలంగాణలో అమలు చేయాలని



సూచించారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.

## పర్సపూర్ లో ఘనంగా టి ఆర్ ఎస్ జెండా పండుగ

**పార్టీ బలోపేతానికి నాయకుల పిలుపు**



**నారాయణపేట ఆగస్టు 1: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం, మద్దూర్ మండలం, పర్స పూర్ గ్రామంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యం లో శనివారం జెండా పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్, కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి నీలి జనార్ధన్, జిల్లా యువత అధ్యక్షులు మనోజ్ గౌడ్, మద్దూర్ మండల అధ్యక్షులు రవి కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, బాలచందర్ గౌడ్, నరేష్ , సంజీవయ్య , మాధవ్, ప్రసాద్, పాకిరప్ప, మహిపాల్, లాలప్ప, నర్సాపూర్ గ్రామ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఇతర జిల్లాల మండల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలో పార్టీ అభివృద్ధికి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయా లని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలపై నిరం తరం పోరాటం చేస్తూ వారి హక్కుల సాధన కోసం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుం దని తెలిపారు. అలాగే కొడంగల్ నియోజకవర్గంలో పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయ డానికి అందరూ కలిసి పనిచేయాలని సూచించా రు.కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి నీలి జనార్ధన్ మాట్లాడుతూ నియోజకవ ర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేసి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తా మని తెలిపారు. తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపే తం చేసి కవిత అక్కను తెలంగాణ ముఖ్యమంత్రిగా చూడడమే తమ లక్ష్యమని అన్నారు.జిల్లా యువత అధ్యక్షులు మనోజ్ గౌడ్ మాట్లాడుతూ, పార్టీ పంచ జన్యం కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని, పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమం పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసమేనని పేర్కొన్నారు.మద్దూర్ మండల అధ్య క్షులు రవి కుమార్ మాట్లా డుతూ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని, ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను విస్త రిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పట్టణ అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి

**చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్**



**నారాయణపేట ఆగస్టు 1: (స్కైన్యూస్)** నారాయణపేట మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వ యంతో పని చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్ కోరారు.శనివారం వివిధ శాఖల పనులపై సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని తమ తమ శాఖల పరిధిలో జరు గుతున్న అభివృద్ధి పను లు, ప్రజలకు అందిస్తున్న సేవలు, పెండింగ్‌లో ఉన్న అంశాలపై వివరాలను సమర్పించారు.ఈ సంద ర్భంగా చైర్‌పర్సన్ కొండ స్వేత సత్య యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి అధికారి బాధ్యతా యుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమ స్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారా నికి వేగంగా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు.మున్సిపల్ పరిధిలో పారి శుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల నిర్వహ ణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రతి శాఖ బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు.ప్రజల సంక్షేమం, పట్టణ అభివృద్ధే మున్సి పాలిటీ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబె ట్టాలని చైర్‌పర్సన్ సూచించారు.

# ఉత్తమ ఎచ్ ఎం,ఉపాధ్యాయులు,లకు అంతర్జాతీయ విద్యా అధ్యయన పర్యటన దరఖాస్తులకు ఆహ్వానం

**నారాయణపేట ఆగస్టు 1: (స్కైన్యూస్)**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ వినూత్న బోధన, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలలో విశేష కృషి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు అంతర్జాతీయ విద్యా అధ్యయన పర్యటన లో పాల్గొనేందుకు దరఖాస్తు లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమా న్ని పాఠశాల విద్యాశాఖ, తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు.జిల్లాకు వివిధ కేటగిరీలలో మొత్తం 5 మంది ఎంపిక చేయబడతారనీ తెలిపారు. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన ఎంపిక కమిటీ, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తుందన్నారు.దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలలో పేర్కొన్న అర్హతలను తప్పనిసరిగా కలిగి ఉండాలనీ.ప్రభుత్వ / జిల్లా పరిషత్ / మండల పరిషత్ / తెలంగాణ గురుకుల / తెలంగాణ మోడల్ పాఠశాలలలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మాత్రమే అర్హులు అని తెలిపారు.సంబంధిత కేడర్‌కు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన కనీస సేవా అర్హత కలిగి ఉండాల న్నారు.గతంలో అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్‌లో పాల్గొనని వారు ఉండాల న్నారు.సేవా రికార్డు సంతృప్తికరంగా ఉండాలనీ బోధనలో వినూత్న పద్ధతులు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, పాఠశాల అభివృద్ధి, సమాజ భాగస్వామ్యం, అకడమిక్ నాయకత్వం వంటి అంశాలలో విశేష కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందనీ తెలిపారు.కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన నిబద్ధత, సృజనాత్మకత, విద్యా రంగంలో చేసిన ప్రత్యేక కృషి తదితర అంశాలను కూడా ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటారన్నారు.అర్హులైన అభ్యర్థులు నిర్ణీత దరఖాస్తు నమూనాలో తమ సేవా వివరాలు, అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, సాధించిన విజయాలకు సంబంధించి న ఆధారాలను జతచేసి నేటి నుంచి 5 వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నారాయణపే టలో సమర్పించాలనీ సూచించారు.దరఖాస్తుల పరిశీలన, ధ్రువపత్రాల నిర్ధారణ ఈ నెల 5 న జిల్లా స్థాయి ఎంపిక కమిటీ చేస్తుందని ఇంటర్వ్యూ 6న నిర్వహించి ఎంపికైన అభ్యర్థుల పేర్లు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయబడతాయనీ తెలిపారు.అభ్యర్థులు దరఖాస్తు సమర్పించే ముందు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ను పూర్తిగా పరిశీలించి, అవసరమైన అన్ని ధ్రువప త్రాలను జతపరచాలని జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు.

# విద్యార్థులు, యువమోర్చా కార్యకర్తలపై లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం

**ప్రశ్నించే యువత గొంతును లాఠీలతో అణచివేయడం ప్రజాస్వామ్యమా?**

**పోలీసుల దాష్టీకంపై భగ్గుమన్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భండారి శాంతికుమార్**

**మహబూబ్‌నగర్: ఆగస్టు స్కైన్యూస్ )** విద్యార్థులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన సందర్భంగా విద్యార్థులు, యువమోర్చా నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భండారి శాంతికుమార్ తీవ్రంగా ఖండించారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ**

"ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరమా? నిరసన తెలపడం నేరమా? తమ హక్కులు, ఆత్మగౌరవం కోసం గొంతెత్తిన విద్యార్థులు, యువతకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం వారిపై లాఠీలు ప్రయోగించడం అత్యంత దురదృష్టకరం. మహబూబ్‌నగర్‌లో విద్యార్థులు, బీజేవైఎం కార్యకర్తలపై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం. లాఠీలతో యువత గొంతును అణచివేయలేరు."విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, ప్రశ్నించే వారిపై పోలీసు బలాన్ని ప్రయోగించడం



ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని శాంతికుమార్ మండిపడ్డారు.
"యువత అడిగే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి తప్ప, పోలీసు బలంతో వారి గొంతును అణచివేయాలని చూడకూడదు. అధికారం శాశ్వతం కాదు. లాఠీ దెబ్బలతో ప్రజల ప్రశ్నలను ఆపలేరు. ఒక్కో లాఠీ దెబ్బ యువతలోని పోరాట స్ఫూర్తిని మరింత బలపరుస్తుంది." విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టకుండా, వారి సమస్యలపై ప్రశ్నించిన వారిని అణచివేసే ప్రయత్నం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు. "విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం ఒకవైపు... వాటిని ప్రశ్నిస్తూ రోడ్డెక్కిన యువతపై లాఠీలు ప్రయోగించడం మరోవైపు. ఇదేనా కాంగ్రెస్ చెప్పే ప్రజాపాలన?" అని ప్రశ్నించారు. లాఠీచార్జ్ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శాంతికుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థులపై చేసిన వ్యాఖ్యల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. "విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల విషయంలో బీజేపీ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. యువత గొంతుకగా నిలబడి ప్రజాస్వామ్యబద్ధంగా మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం. లాఠీలతో ఉద్యమాలను ఆపగలమని భావిస్తే అది కాంగ్రెస్ ప్రభుత్వ భ్రమ మాత్రమే."అని భండారి శాంతికుమార్ స్పష్టం చేశారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేష్టకరం

**జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 1( స్కై న్యూస్)** పుట్టిన ప్రతి బిడ్డకు మొదటి టీకా తల్లిపాలు అని విద్యా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిపాలు ఎంతో శ్రేష్టకరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ అన్నారు శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భవతులకు బాలింతలకు నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆయన హాజరై గారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు నీళ్ల విరేచనాలు న్యూమోనియా వ్యాధులు రాకుండా తల్లిపాలు కాపాడుతాయని వివరించారు. ఎట్టి పరిస్థితులలో తేనె చక్కెర గుల్కోస్ నీరు లాంటి పానీయాలు ఇవ్వవద్దని మొదటి మూడు రోజులు తల్లిపాలలో ముర్రుపాలు వ్యాధి నిరోధక శక్తిని పెరగడానికి తెలిపారు. పాల వల్ల తల్లికి బిడ్డకు అనుబంధం పెరుగుతుందని తల్లిపాల వల్ల అధిక రక్తపోటు మధుమేహం ఉపకాయం బారిన పడకుండా నివారించ



గలగవచ్చని తెలిపారు సమావేశంలో జి జి హెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ బాలింతలు తీసుకోవలసిన ఆహారం వివరించారు కార్యక్రమంలో డాక్టర్ రవిశంకర్ డాక్టర్ అజీజ్ పీడియాట్రిషన్ డాక్టర్ సిరాజుద్దీన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్ బాబు డాక్టర్ రవికుమార్ అదనపు



వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్ వైద్యాధికారి డాక్టర్ సృజన ఇన్చార్జి సిడిపిఓ శోభారాణి జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి డిపిఓ రేణయ్యా డివిఎల్ఎం కుమార్ ఏపీవోలు భాగం రాజేశ్వర్ నిరంజన్ దివ్య అసిస్టెంట్ కాళ్ల యాదగిరి ఏఎన్ఎం నర్సింగమ్మతోపాటు ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు

# రైల్వే స్టేషన్ లో తల్లిపాలు గది ప్రారంభించిన డిఎంహెచ్ఓ

**నవజాత శిశువుకు తల్లిపాలే రక్షణ కవచం**

**జిల్లా సంక్షేమ అధికారిని జె. స్వర్ణలత లేనినా**

**కొత్తగూడెం ఆగస్ట్ 1( స్కై న్యూస్ ):** బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలలు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని, ఆ తర్వాత మరో సంవత్సరం పాటు తల్లిపాలు ఇవ్వడం తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణకు రక్షణ కవచం లాంటిదని జిల్లా వైద్య అధికారి తుకారాం రాథోడ్ జిల్లా సంక్షేమ అధికారిని జే స్వర్ణలత లేనినా పేర్కొన్నారు. స్థానిక భద్రాద్రి కొత్తగూడెం రైల్వే స్టేషన్ లో తల్లి పాలిచ్చే గదిని ముఖ్య అతిథిగా పాల్గొని లాంఛనంగా ప్రారంభించి బాలింతలకు తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసవించిన మొదటి గంటలోపే తల్లిపాలు ఇవ్వడాన్ని ప్రారంభించేలా తల్లులకు సహకారం అందించాలని, తల్లిపాలే నవజాత శిశువును అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయని, బిడ్డ పుట్టినప్పటి నుండి ఆరు నెలల నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించడం, ఈ ఆరు



నెలల్లో బిడ్డ ఎదుగుదల మరి అభివృద్ధికి అవసరమైన పోషకాలన్ని తల్లిపాలలోని లభిస్తాయని, ఇలాంటి ఇతర పదార్థాలు తినిపించకుండా, త్రాగించకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నప్పుడు మాత్రమే తల్లి బిడ్డల ఆరోగ్య భద్రత ఉంటుందని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా బిడ్డ పుట్టిన వెంటనే తేనే, పంచదార లాంటి మూఢనమ్మకాలు



నమ్మకుండా ముర్రుపాలె ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అర్బన్ సిడిపిఓ, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, మహిళా సాధికారిత జిల్లా బృందం,, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ మురళి హెడ్ కానిస్టేబుల్ సిబ్బంది, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలో జనసేన జెండా ఎగురవేస్తాం

**జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు రామ్ తళ్లూరి, ఆర్కే సాగర్, సినీ నటుడు తనీష్**

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 1 (స్కై న్యూస్):** తెలంగాణలో గ్రామ స్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేసి ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యమని జనసేన రాష్ట్ర నాయకులు రామ్ తళ్లూరి, ఆర్కే సాగర్, సినీ నటుడు తనీష్ తెలిపారు. మహబూబ్‌నగర్ పార్లమెంటరీ పరిధిలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనానికి వెళ్తున్న రాష్ట్ర నాయకులకు షాద్‌నగర్ బైపాస్ వద్ద స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని 17 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఆత్మీయ



సమ్మేళనాలు నిర్వహించి పార్టీని క్షేత్రస్థాయిలో విస్తరిస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పోరాడుతూ, గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేసి యువతను, కార్యకర్తలను చైతన్యవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జరుపుల రాజు నాయక్, మహమ్మద్ అశ్రఫ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చౌరస్తా విస్తరణ చేపట్టాలి.. విద్యార్థుల ఆందోళన

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 1 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా విస్తరణ పనులను వెంటనే చేపట్టి రోడ్డు ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేస్తూ సామాజికవేత్త రాము ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం పట్టణ ప్రధాన కూడలిలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు



మాట్లాడుతూ, పెరుగుతున్న వాహనాల రద్దీ, రహదారుల ఆక్రమణల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ప్రజావాణిలో ఇచ్చిన ఆదేశాలు ఉన్నప్పటికీ స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల అధికారులు ఆక్రమణలు తొలగించినప్పటికీ, విస్తరణ పనులు నిలిచిపోయాయని రాము విమర్శించారు. ప్రజల ప్రాణాల రక్షణ కోసం రోడ్డు విస్తరణను వేగవంతం చేయాలని, వ్యాపారులు కూడా సహకరించాలని కోరారు. ఆందోళన సందర్భంగా పట్టణ ఎస్ఐ సుశీల విద్యార్థులు, సామాజికవేత్త రాముతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

# ప్రతి ఇంటికి ఆరు మొక్కలు నాటాలి: సర్పంచ్ అనురాధ

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 1 (స్కై న్యూస్):** వర్షాకాలాన్ని పురస్కరించుకుని ఫరూఖ్ నగర్ మండలంలోని కొండన్నగూడ గ్రామంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జానంపేట అనురాధ గ్రామస్థులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి కుటుంబం ఆరు మొక్కలు నాటి వాటిని సంరక్షించి పచ్చని గ్రామ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు వాతావరణ సమతుల్యత నెలకొని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్





కమిటీ డైరెక్టర్ జానంపేట సురేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నాగమణి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భారీ పెట్టుబడి మోసం కేసును ఛేదించిన భద్రాద్రి జిల్లా పోలీసులు

**ప్రధాన నిందితుడి అరెస్టు.. నేరార్జిత ఆస్తులుగా గుర్తించిన 35 వాహనాలు స్వాధీనం**

**లక్ష్మీదేవి పల్లి ఆగస్టు 1(స్కై న్యూస్ ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం.134/2026 కేసులో ప్రధాన నిందితుడు బేతంపూడి భరత్ కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 35 వాహనాలు, ఇతర చరాస్తులను



స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం




డీఎస్పీ ఆదినారాయణ వివరాలను వెల్లడించడం జరిగింది.భార్వాటీ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితుడు తాను భద్రాచలం ఐటీసీ పేపర్ బోర్డ్స్‌లో లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నానని, తనతో భాగస్వామిగా ఉంటే కాంట్రాక్ట్ పనులు ఇప్పించి అధిక లాభాలు అందిస్తానని నమ్మబలికి పలువురు బాధితుల నుంచి సుమారు రూ.52 కోట్ల మేర పెట్టుబడుల పేరుతో మోసపూరితంగా డబ్బులు సేకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.బాధితుల విశ్వాసాన్ని పొందేందుకు నకిలీ భాగస్వామ్య ఒప్పందాలు, తప్పుడు పత్రాలు రూపొందించి, లాభాల్లో 4 శాతం వాటా ఇస్తామని హామీలు ఇచ్చి మోసానికి పాల్పడినట్లు విచారణలో తేలిందని తెలిపారు. అలాగే బీకే నాయుడు అండ్ కో., రాజేశ్వరి ట్రావెల్స్ పేర్లతో సంస్థలను నిర్వహిస్తూ ఈ మోసపూరిత కార్యకలాపాలు సాగించినట్లు గుర్తించినట్లు వెల్లడించారు.సాంకేతిక ఆధారాలు, ఆర్థిక లావాదేవీల విశ్లేషణ ఆధారంగా నిందితుడిని కేరళ రాష్ట్రంలోని పాలా ప్రాంతంలో అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై జిల్లాకు తీసుకువచ్చి పోలీసు కస్టడీలో విచారించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 6 బస్సులు, ఒక వాటర్ ట్యాంకర్ లారీ, 3 ట్రాక్టర్లు, 2 వ్యవసాయ పరికరాలు, 7 కార్లు, 14 ద్విచక్ర వాహనాలు, 2 ట్రైలర్లు కలిపి మొత్తం 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.అదేవిధంగా బాధితుల నుంచి మోసపూరితంగా సేకరించిన డబ్బుతో భద్రాచలంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఒక మూడు అంతస్తుల భవనం, ఒక ప్లాట్ కొనుగోలు చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు.ఈ కేసులో ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, సంబంధిత పత్రాల పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. మరిన్ని బాధితులను గుర్తించడం, నేరార్జిత ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకోవడం, పూర్తి మనీ ట్రైల్‌ను వెలికితీసే దిశగా దర్యాప్తు కొనసాగుతోందన్నారు.అధిక లాభాలు వస్తాయని, తక్కువ సమయంలో పెట్టుబడికి రెట్టింపు లేదా భారీ రాబడులు వస్తాయని చెప్పే వ్యక్తులు లేదా సంస్థలను గుడ్డిగా నమ్మి డబ్బులు పెట్టవద్దని ప్రజలకు సూచించారు. ఆకర్షణీయమైన హామీలు, నకిలీ పత్రాలు, తప్పుడు ఒప్పందాలతో మోసగాళ్లు ప్రజలను మభ్యపెడుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానాస్పద పెట్టుబడి పథకాలపై సమాచారం తెలిసినా లేదా మోసానికి గురైనా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల అప్రమత్తతతోనే ఇటువంటి ఆర్థిక నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన లక్ష్మీదేవిపల్లి పోలీసు సిబ్బందిని, జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు .

## బిజినెస్

### బీమా రంగంలోకి పతంజలి




**న్యూఢిల్లీ, జూలై 30:** బాబా రామ్‌దేవ్‌నకు చెందిన ఎఫ్ఎంసీజీ సంస్థ పతంజలి ఆయుర్వేద గ్రూపు తాజాగా బీమా రంగంలోకి అడుగుపెట్టడానికి సిద్ధమైంది. ప్రస్తుతం ఎఫ్ఎంసీజీ, ఆయుర్వేద ఉత్పత్తులను విక్రయిస్తున్న సంస్థ..జనరల్ ఇన్సూరెన్స్ విభాగంలోకి అడుగుపెట్టడానికి మార్గం సుగమమైంది. ఇందుకు సంబంధించి మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో మెజారిటీ వాటా కొనుగోలు ప్రతిపాదనకు బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం పతంజలి ఆయుర్వేదకు మాగ్మా ఇన్సూరెన్స్‌లో 73.56 శాతం వాటా దక్కనుండగా, డీఎస్ గ్రూపునకు 24.5 శాతం వాటా దక్కనున్నది. వచ్చే మూడు నెలల్లో పూర్తికానున్న ఈ ఒప్పందం విలువ రూ.4,500 కోట్ల స్థాయిలో ఉన్నట్టు అంచనా. ప్రస్తుతం మాగ్మా ఇన్సూరెన్స్ కంపెనీ మోటార్, హెల్త్, ప్రాపర్టీ, కమర్షియల్ ఇన్సూరెన్స్ ఉత్పత్తులను విక్రయిస్తున్నది.

### బీహెచ్ఈఎల్‌కు రూ 2,500 కోట్ల ఆర్డర్

BHEL

**రామచంద్రాపురం, జూలై 30:** విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థయైన భెల్ మరో భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. నైజీరియా నుంచి ఎనిమిది గ్యాస్ టర్బైన్ జనరేటర్ల ప్రతిష్ఠాత్మక ఆర్డర్ లభించిందని, దీని విలువ రూ.2,500 కోట్ల స్థాయిలో ఉంటుందని కంపెనీ ఈడీ శ్రీనివాసరావు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో తీవ్రమైన పోటీ మధ్య ఈ ఆర్డర్ దక్కించుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. ఈ ఆర్డర్‌లో భాగంగా ఎనిమిది గ్యాస్ టర్బైన్ జనరేటర్ రూపకల్పన, తయారీ, సరఫరాతోపాటు ప్రాజెక్టు కార్యకలాపాలు నిర్వహించాల్సివుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ జనరేటర్ పరికరాలను హైదరాబాద్‌తోపాటు బెంగళూరులో ఉన్న ప్లాంట్లో తయారు చేస్తున్నట్టు చెప్పారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

# సెన్సెక్స్ 273 పాయింట్లు లాభం

భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండో రోజూ మార్కెట్ లాభాల్లో ముగియడం విశేషం. బీఎస్ఈ సెన్సెక్స్ 273 పాయింట్లు లాభపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 66 పాయింట్లు లాభపడింది. ట్రేడింగ్ చివర్లో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు పాల్పడటం, ప్రస్తుతానికి వడ్డీ రేట్లు పెంపు లేకున్నా సెప్టెంబర్‌లో వడ్డీ రేట్ల పెంపు ఉంటుందని అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ప్రకటించడం మార్కెట్‌కు కలిసొచ్చింది. బీఎస్ఈ సెన్సెక్స్ గురువారం ఉదయం లాభాల్లోనే ప్రారంభమైంది. రోజులో ఒక దశలో 78,007.09 పాయింట్ల గరిష్ట స్థాయికి చేరగా, 77,440.91 పాయింట్ల కనిష్ట స్థాయిని చూసింది. చివరకు 273.55 పాయింట్లు (0.35 శాతం) లాభంతో 77,928.15 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ 50 షేర్ నిఫ్టీ కూడా 66.95 పాయింట్ల లాభంతో 24,317.15 వద్ద ముగిసింది. అయితే, బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 67.50 పాయింట్లు నష్టపోయింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ కూడా 57.82 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ ఐటీ, నిఫ్టీ మెటల్ షేర్లు లాభాలు చవిచూశాయి. అందులో నిఫ్టీ ఆటో షేర్లు 1.63 శాతం పెరిగాయి. బీఎస్ఈ 30 ఇండెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్ గ్రిడ్, టెక్ మహీంద్రా, మారుతి, రిలయన్స్ భారీగా లాభపడ్డాయి. అందులో ఎం అండ్ ఎం 2.01 శాతం లాభాలు పొందింది. అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి.



వీటిలో అదానీ పోర్ట్స్ షేర్లు 3.46 శాతం నష్టపోయాయి. అంతర్జాతీయంగా ఒడుదొడుకులు ఎదురవుతున్నప్పటికీ భారతీయ మార్కెట్లు నిలకడగా రాణిస్తున్నాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ ధర పెరిగింది. బ్యారెల్‌కు 90 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.67 వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,068.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## కొత్తవారికి అప్పు పుట్టట్లేదు..

# పాత ఖాతాదారులకే రుణాలిచ్చేందుకు బ్యాంకులు ఆసక్తి

**ముంబై :** కొత్తగా రుణాలు తీసుకోవాలనుకొనేవారిపట్ల గతంతో పోల్చితే బ్యాంకులు ఇప్పుడు అంతగా ఆసక్తి చూపట్లేదని, పాత కస్టమర్ల వైపే మొగ్గు చూపుతున్నాయని ప్రముఖ క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ ట్రాన్స్‌యూనియన్ (టీయూ) సిబిల్ చెప్తున్నది. సిబిల్ తాజా డాటా ప్రకారం గత ఆర్థిక సంవత్సరం (2025-26) కొత్త రుణగ్రహీతలు అన్ని రుణాల్లో కలిపి 13 శాతంగానే ఉన్నారు. అయితే పదేండ్ల క్రితం (2016-17) ఇది 32 శాతంగా ఉన్నట్టు గురువారం సిబిల్ వెల్లడించింది. చిరు వ్యాపారులకు రుణాల విషయంలోనూ కొత్త రుణగ్రహీతల వాటా 60 శాతం నుంచి 39 శాతానికి పడిపోయినట్టు చెప్పింది. నిజానికి దేశంలో రుణ అర్హత కలిగినవారు 2017 మార్చిలో 79 కోట్లుగా ఉంటే.. 2026 మార్చిలో 89 కోట్లకు పెరిగారని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఆ స్థాయిలో నూతన రుణగ్రహీతలు పెరుగలేదని చెప్పడం గమనార్హం.

**ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో..**

ప్రైవేట్ రంగ బ్యాంకులు కొత్తగా అప్పులు తీసుకోవాలనుకొనేవారికి పెద్దగా అవకాశం ఇవ్వడం లేదని ఈ సందర్భంగా టీయూ సిబిల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, ఎండీ భవేశ్ జైన్ అన్నారు. ఎక్కువమంది ప్రభుత్వ రంగ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లోనే రుణాలు పొందుతున్నారని చెప్పారు. అయితే ఎగవేత భయాలు లేదా క్రెడిట్ పాలసీలు కొత్తవారి రుణాల మంజూరులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్న జైన్.. పాత రుణగ్రహీతలతో పోల్చితే కొత్తవారి నుంచి రుణాల వసూళ్లు ఇబ్బందికరంగా మారడమూ ఈ పరిస్థితికి కారణమేనన్నారు.

**ఫోన్ల కోసం రుణాలు**

కరోనాకు ముందు ద్విచక్ర వాహనాల కొనుగోలు కోసం ఎక్కువమంది రుణాలపై ఆధారపడేవారని, ఇప్పుడు ఆ




స్థానంలో మొబైల్ ఫోన్ వచ్చిందని జైన్ తెలిపారు. అలాగే మొబైల్ ఫోన్ల కొనుగోలు కోసం తీసుకుంటున్న సగటు రుణం విలువ రూ.35,000పైనేనని, ఎక్కువగా ఎన్‌బీఎఫ్‌సీల్లో పొందుతున్నారని చెప్పారు.

## నిస్వార్థ సేవకుడు.. ఆట ముగించాడు!..

# అంతర్జాతీయ క్రికెట్‌కు రహానే వీడ్కోలు

ఆస్ట్రేలియాతో ప్రతిష్ఠాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (2020-21)ని గెలిచి స్వదేశానికి చేరుకున్నాక ముంబైలో కొంతమంది అభిమానులు రహానే ఇంటివద్ద కంగారూ బొమ్మతో ఉన్న ఒక ప్రత్యేకమైన కేక్‌ను తయారుచేయించి దానిని కట్ చేయాలని కోరారు. అప్పుడతడు ఆ బొమ్మను తొలగిస్తేనే కట్ చేస్తానని చెప్పడంతో అక్కడున్నవారంతా ఆశ్చర్యానికి గురయ్యారు. తాము గెలిచింది ఆటలో కానీ ఆ దేశానికి గర్వకారణమైన జాతీయ జంతువును అగౌరవపరచడం తమ అభిమతం కాదని అతడు చెప్పకనే చెప్పాడు. రహానే వ్యక్తిత్వం గురించి చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణలు అవసరం లేదు. భావోద్వేగాలకు నిలయమైన క్రికెట్‌లో ఎక్కడా తన ప్రశాంతతను కోల్పోకుండా తన తోటి ఆటగాళ్లకే గాక ప్రత్యర్థులనూ నొప్పించకుండా ఆటలో వారితోనే శభాష్ అనిపించుకున్న అతికొద్దిమంది గొప్ప క్రికెటర్లలో రహానే ఒకడు.

ఈ ముంబై క్రికెటర్ గురువారం తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ వీడియో రిలీజ్ చేస్తూ... 'నా కెరీర్‌లో స్వార్థం చూసుకోకుండా ఎల్లప్పుడూ నా దేశం, జట్టు ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఇచ్చాను. పూర్తి నిజాయితీతో ఈ ఆట ఆడాను.అజింక్యా అంటే ఓటమి లేనివాడని అర్థం. కానీ క్రికెట్ నాకు ఎన్నోసార్లు ఓటములను చూపించింది. క్రీడాకారులుగా మేము సాధించే విజయాల కంటే పొందే వైఫల్యాలే ఎక్కువ. నా జట్టు మ్యాచ్‌లు ఓడింది, నేనూ తప్పులు చేశాను. కానీ అభిమానుల హృదయాల్లో నేను ఎప్పుడూ ఓడిపోలేదు' అని కన్నీటితో చెప్పాడు. 2011 నుంచి 2023 దాకా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రహానే.. 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20లు ఆడాడు.

**ఆ సిరీస్ ప్రత్యేకం**

అది 2020-21 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ. ఆడేది ఆస్ట్రేలియా సొంతగడ్డపై.. తొలి టెస్టు జరిగిన అడిలైడ్‌లో కంగారూ పేసర్ల ధాటికి 36 పరుగులకే ఆలౌటైన భారత్‌కు అవమానకర ఓటమి.. దీనికి తోడు వ్యక్తిగత కారణాలతో రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు గాయం కారణంగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా సిరీస్‌కు దూరమయ్యారు. ఇలాంటి స్థితిలో సారథ్య పగ్గాలు అందుకున్న వారెవరైనా విజయం సంగతి దేవుడెరుగు.. సిరీస్ ముగిస్తే అదే పదివేలు అనుకుంటారు. అదీగాక ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టులో ఓడి మళ్లీ సిరీస్‌లో పుంజుకున్న దాఖలాలే లేవు. కానీ నాయకత్వ పగ్గాలు అందుకున్న రహానే మాత్రం పాత పుస్తకాల దుమ్ముదులుపుతూ నవచరిత్రను లిఖించాడు.




అంతగా అనుభవం లేని జట్టును అతడు ముందుండి నడిపించిన తీరు గురించి ఎంత చెప్పినా తక్కువే. అడిలైడ్ అపజయం తర్వాత రెండో టెస్టు జరిగిన మెల్‌బోర్న్‌లో సారథిగా సెంచరీ (122) చేసి తన జట్టుకు స్ఫూర్తినిస్తూ టీమిండియా విజయానికి బాటలు వేశాడు. మూడో టెస్టు డ్రా. గబ్బాలో నాలుగో టెస్ట్. హేజిల్‌వుడ్, కమిన్స్, స్టార్క్ త్రయం.. భారత బ్యాటర్ల తలలను లక్ష్యంగా చేసుకుని సందిస్తున్న బౌన్సర్లను పుజారాతో తట్టుకుని జట్టుకు ధైర్యం నూరిపోయడంలో రహానేది కీలకపాత్ర.

అప్పటికీ అంతర్జాతీయ అనుభవం లేని సిరాజ్, శార్దూల్, నటరాజన్, వాషింగ్టన్, పంత్, గిల్ వంటి యువకులతో ఆసీస్‌కు ముచ్చెమటలు పట్టించి సిరీస్‌ను చేజిక్కించుకోవడంలో కీలకంగా వ్యవహరించాడు. యువ జట్టుతో ఇంతటి గొప్ప విజయాన్ని సాధించినా గబ్బాలో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో పంత్‌కు జాతీయ జెండాను అప్పగించి తాను రెండో వరుసలోకి వెళ్లిపోయి నిలుచోవడం రహానే నాయకత్వ లక్షణానికి మరో ఉదాహరణ. టెస్టుల్లో అతడు 6 మ్యాచ్‌లకు సారథిగా ఉంటే ఓటమన్నదే లేకుండా నాలుగింట్లో గెలిచి రెండింటిని డ్రా చేసుకున్నాడు.

**విదేశాల్లో ఫుల్ సక్సెస్**

రహానే స్వదేశంలోకంటే విదేశాల్లోనే ఎక్కువ విజయవంతమయ్యాడు. రహానే తన టెస్టు కెరీర్‌లో 5,077 రన్స్ చేయగా అందులో విదేశీ పిచ్‌లపై 51 టెస్టులు ఆడి 39.43 సగటుతో 3,234 రన్స్ సాధించడం గమనార్హం. తన కెరీర్‌లో 12 శతకాలు సాధిస్తే అందులో 8 విదేశాల్లో చేసినవే. రహానే.. చివరిసారి 2023లో వెస్టిండీస్‌తో సిరీస్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

**రోకో నీడలో గుర్తింపు రాక..**

గవాస్కర్, వెంగ్‌సర్కార్, సచిన్ వంటి దిగ్గజ క్రికెటర్లు వచ్చిన ముంబై నుంచే తన ప్రస్థానాన్ని ప్రారంభించిన రహానేకు రావాల్సినంత గుర్తింపు రాలేదని కాదనలేని సత్యం. రహానే ఆడిన కాలంలోనే భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తమ బ్యాటింగ్ విన్యాసాలతో సచిన్ తర్వాత భారత బ్యాటింగ్ లైనప్‌కు కర్త, కర్మ, క్రియ అయ్యారు. మీడియా సైతం వీరి చుట్టే తిరిగింది. టెస్టుల్లో వీరికి తోడు పుజారా.. ద్రవిడ్‌ను మరిపిస్తూ 'నయా వాల్'గా గుర్తింపు పొందాడు.

కానీ రహానే మాత్రం ఎన్నడూ గుర్తింపు కోసం పాకులాడలేదు. స్టార్‌గా ఎదిగినా దేశవాళీల్లో తనను తాను సానబెట్టుకుంటూ యువ ఆటగాళ్లకు ఆదర్శంగా నిలిచాడు. తన పని అయిపోయిందన్నప్పుడల్లా తానెంటో నిరూపించుకున్నాడు. తన ఆటపై ఎన్ని విమర్శలు వచ్చినా సైలెంట్‌గా తన పని తాను చేసుకుంటూ నిస్వార్థ సేవకుడిగా జట్టుకు సేవలందించిన రహానే.. తన కెరీర్‌నూ హంగూ ఆర్భాటాలు లేకుండా అంతే నిశ్శబ్దంగా ముగించడం కొసమెరుపు!

## స్పోర్ట్స్

### పారా హుషారు..

### పారా స్ప్రింటర్ దిలీప్ పసిడి పరుగు..

### బాసిల్‌కు రజతం




గ్లాస్గో: వైకల్యం శరీరానికే తప్ప సాధించాలన్న తపనకు కాదని నిరూపిస్తూ కామన్వెల్త్ గేమ్స్‌లో భారత పారా అథ్లెట్లు అసాధారణ ప్రదర్శన చేస్తున్నారు. సాధారణ క్రీడాకారులకు ఏమాత్రం తీసిపోని విధంగా పతకాల మోత మోగిస్తున్నారు. స్ప్రింటర్లు దిలీప్ మహదు గావిత్, మొహమ్మద్ బాసిల్ పురుషుల 100 మీటర్ల టీ47 విభాగంలో స్వర్ణం, రజతంతో సత్తా చాటారు. బుధవారం అర్ధరాత్రి వర్షంతో తడిసిన ట్రాక్‌పై, ప్రతికూల పరిస్థితుల్లో జరిగిన ఫైనల్లో దిలీప్ గావిత్ తన పర్సనల్ బెస్ట్ టైమింగ్ 10.71 సెకండ్లతో గేమ్స్ రికార్డు సృష్టిస్తూ అగ్రస్థానం అందుకోగా.. బాసిల్ సీజన్ బెస్ట్ 10.83 సెకండ్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్ అథ్లెట్ కెవిన్ శాంటోస్ 10.85 సెకండ్లతో కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు.

**ఫైనల్లో నీరజ్**

భారత ఒలింపిక్ హీరో, స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా మెన్స్ జావెలిన్ త్రోలో ఫైనల్ చేరుకున్నాడు. రోహిత్ యాదవ్, యశ్వీర్ కూడా పతక పోరుకు అర్హత సాధించారు. గురువారం బలమైన గాలులు, ప్రతికూల వాతావరణం మధ్య సాగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో నీరజ్ తన రెండో ప్రయత్నంలో జావెలిన్‌ను అత్యధికంగా 79.61 మీటర్ల దూరం విసిరాడు. ఫైనల్‌కు క్వాలిఫై అయిన 12 మందిలో ఐదో స్థానంలో నిలిచాడు. 18 డిగ్రీల చలి, బలమైన గాలులతో ఇబ్బందిపడటంతో ఆటోమేటిక్ ఫైనల్ క్వాలిఫయింగ్ మార్కు (84 మీటర్ల)ను ఏ ఒక్క అథ్లెట్ సాధించలేకపోయాడు. రోహిత్ (78.37మీ), యశ్వీర్ (78.36 మీ) వరుసగా 9, 10వ స్థానాలతో ఫైనల్లో అడుగు పెట్టారు. శుక్రవారం ఫైనల్ జరగనుంది.

**మన్‌ప్రీత్ చేజారిన పతకం**

మహిళల షాట్ పుట్‌లో భారత అథ్లెట్ మన్‌ప్రీత్ సింగ్ కొద్దిలో కాంస్య పతకం చేజార్చుకుంది. ఫైనల్లో ఆమె 17.49 మీటర్లతో నాలుగో స్థానంలో నిలిచింది. వెయిట్ లిఫ్టింగ్‌లో మార్టినా దేవి, స్టీపుల్‌ఛేజ్‌లో పారుల్ చౌదరికి నిరాశే ఎదురైంది. 86o కేజీ విభాగం ఫైనల్లో మార్టినా 245 కిలోల (స్నాచ్ 105, జర్క్ 140) బరువెత్తి ఐదో స్థానంతో సరి పెట్టగా.. 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో పారుల్ 9నిమిషాల 26.75 సెకండ్లతో ఐదో స్థానంలో నిలిచి నిరాశపరిచింది. ఇక, పురుషుల షాట్‌పుట్‌లో భారీ అంచనాలున్న తజిందర్‌పాల్ సింగ్ 20.27 మీటర్లతో ఐదో స్థానంలో నిలిచి నిరాశపరచగా.. సమర్‌దీప్ సింగ్ 20.03 మీటర్లతో ఏడో ప్లేస్‌తో సరిపెట్టాడు.

# అఖిల్ కెరీర్‌లో ఫస్ట్ బ్లాక్‌బస్టర్.. రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన 'లెనిన్'!

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డులకెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# ఆ ముగ్గురు స్టార్‌లతో మాత్రం నటించలేకపోయాను..

## మనసులోని మాట బయటపెట్టిన శ్రీకాంత్!

ఒకప్పుడు ఫ్యామిలీ ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ వరుస విజయాలు అందుకున్న టాలీవుడ్ ప్రముఖ నటుడు శ్రీకాంత్, ప్రస్తుతం హీరోగా నటిస్తూనే మరోవైపు క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా సత్తా చాటుతున్నారు. ఇటీవలే 'మిస్టర్ మిడిల్ క్లాస్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఆయన ఆబ్జెక్షన్ మై లార్డ్ అంటూ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అయితే ఇటీవలే ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీకాంత్ తన సుదీర్ఘ సినీ ప్రయాణం, నాటి అనుభవాలు, అప్పట్లో ఎదుర్కొన్న పోటీపై మనసు విప్పి మాట్లాడారు. కెరీర్ తొలినాళ్లలో విలన్‌గా ఎంట్రీ ఇచ్చి, ఆ తర్వాత లవర్ బాయ్‌గా, ఫ్యామిలీ హీరోగా ఎదిగిన శ్రీకాంత్.. ఇప్పుడు తన కుమారుడు రోషన్ హీరోగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడంతో తాను పూర్తిగా విలన్, క్యారెక్టర్ రోల్స్ వైపు మళ్లినట్లు తెలిపారు. మనం అద్దంలో చూసుకున్న తర్వాత మన పరిమితులు ఏంటో మనకు తెలిస్తే లైఫ్‌ను ఎంతో హ్యాపీగా ఎంజాయ్ చేయొచ్చు. హీరోగా రేసులో ఉండటం కంటే విభిన్నమైన పాత్రలు, యాంటీ హీరో రోల్స్ చేయడం చాలా సరదాగా ఉంటుంది, ఎలాంటి టెన్షన్ ఉండదు అని ఆయన స్పష్టం చేశారు. ఇక ఇండస్ట్రీలో పోటీ గురించి మాట్లాడుతూ.. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున వంటి అగ్ర హీరోలతో తమను తాము ఎప్పుడూ పోల్చుకోలేదని, తమకంటూ ఒక ప్రత్యేకమైన కుటుంబ కథా చిత్రాల జోనర్ ఉండేదని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తనతో పాటు జగపతి బాబు కూడా ఫ్యామిలీ సబ్జెక్టులతో బిజీగా ఉండేవారని, దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి ఎక్కువగా తమతోనే సినిమాలు చేసేవారని చెప్పారు. డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్ల కొన్ని మంచి సినిమాలు మిస్సయ్యామని, అలా ఒకసారి తాను వదిలేసిన సినిమా పెద్ద హిట్ అయిందని పాత జ్ఞాపకాలను నెరుకువచ్చారు. అలాగే తన కెరీర్‌లో మహేష్ బాబు, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్ మినహా దాదాపు టాలీవుడ్ స్టార్ హీరోలందరితోనూ స్క్రీన్ షేర్ చేసుకున్నానని శ్రీకాంత్ తెలిపారు. అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి యంగ్ జనరేషన్ హీరోలతోనూ కలిసి పనిచేశానని, భవిష్యత్తులో మిగిలిన యువ హీరోలతోనూ నటించాలని ఉందని తన మనసులోని కోరికను బయటపెట్టారు. ఇక హెయిర్ స్టైల్స్, గెటప్‌ల గురించి చెప్తూ.. గతంలో ఫ్యామిలీ మూవీస్‌లో గెటప్స్ మార్చే ట్రెండ్ లేదని, కానీ ఇప్పుడు కాలం మారుతున్న నేపథ్యంలో 'అఖండ' వంటి చిత్రాల్లో వైవిధ్యమైన గెటప్‌లను ట్రై చేశానని చెప్పారు. కన్నడ పవర్‌స్టార్ దివంగత పునీత్ రాజ్‌కుమార్ చిత్రంలో తాను చేసిన ఫ్యామిలీ విలన్ పాత్ర తనకు మంచి సంతృప్తినిచ్చిందని శ్రీకాంత్ వెల్లడించారు.



# సైబర్ బాధితుల్లో బాలీవుడ్ నటి.. ఎంత దోచుకున్నారో తెలుసా..?

సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు క్యాంపెయిన్‌ను చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే పోలీసులు, అధికార యంత్రాంగం ఎంత అవగాహన కల్పించినా సైబర్ మోసాలకు ఫుల్ స్టాప్ పడటం లేదు. సామాన్యులు, అధికారులు, సెలబ్రిటీలు సైబర్ బాధితుల జాబితాలో చేరిపోతూనే ఉన్నారు. తాజాగా బాలీవుడ్ నటి కీర్తి కుల్హరి సైబర్ మోసానికి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు నటి కీర్తి కుల్హరి మొబైల్‌ఫోన్, క్రెడిట్ కార్డ్‌ను హ్యాక్ చేసి రూ. 2.4 లక్షలు దోచుకున్నారు. తన ఖాతా నుంచి డబ్బులు విత్ డ్రా కావడంతో అప్రమత్తమైన కీర్తి ముంబై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ స్కాం వెనుకున్న వ్యక్తులెవరో గుర్తించి డబ్బును రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సైబర్ క్రిమినల్స్ ఇండియాలో ఎలా రెచ్చిపోతున్నారో..? తాజా ఘటన మరోసారి చెప్పకనే చెబుతోంది.





# అల్లు అర్జున్ ఫ్యాన్స్ మీట్‌తో కొత్త ట్రెండ్.. ఇప్పుడు మిగతా స్టార్ హీరోలపై అభిమానుల ఒత్తిడి!




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఫ్యాన్స్ మీట్ సోషల్ మీడియాలో భారీ చర్చకు దారితీసింది. అభిమానులతో ఒకే వేదికపై కలవడం, వారితో ఆత్మీయంగా ముచ్చటించడం, కలిసి భోజనం చేయడం, ఫోటోలు దిగడం వంటి కార్యక్రమాలతో బన్నీ తన అభిమానులకు మరపురాని అనుభూతిని అందించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు వైరల్ కావడంతో ఇప్పుడు మిగతా స్టార్ హీరోల అభిమానులు కూడా తమ అభిమాన నటులు ఇలాంటి ఫ్యాన్స్ మీట్స్ నిర్వహించాలని కోరుతున్నారు. సాధారణంగా సినిమా ప్రమోషన్స్ లేదా ప్రీ-రిలీజ్ ఈవెంట్లలో అభిమానులను కలిసే స్టార్ హీరోలు, ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించి వారితో సమయం గడపడం అరుదుగా కనిపిస్తుంది. అయితే అల్లు అర్జున్ మాత్రం తన అభిమానుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడటం, వారి అభిప్రాయాలు తెలుసుకోవడం, కలిసి ఫోటోలు దిగడం ద్వారా అందరి ప్రశంసలు అందుకున్నారు. సెలబ్రిటీ హోదాలో ఉన్నప్పటికీ ఎంతో సింపుల్‌గా అభిమానులతో కలిసిపోవడం సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీసింది. ఈ ఫ్యాన్స్ మీట్‌ను కేవలం తెలుగు రాష్ట్రాల అభిమానులకే పరిమితం చేయకుండా, తమిళనాడు, కేరళ, కర్ణాటకతో పాటు హిందీ బెల్ట్‌కు చెందిన అభిమానులను కూడా ఆహ్వానించడం విశేషంగా నిలిచింది. పాన్ ఇండియా స్థాయిలో అభిమానులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా అల్లు అర్జున్ తన అభిమానుల పట్ల ఉన్న అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారు. అంతేకాకుండా, కొందరు అభిమానులకు హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సహాయక కార్యక్రమాలు అందించడం కూడా ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ కార్యక్రమం తర్వాత సోషల్ మీడియా వేదికగా పలువురు అభిమానులు తమ అభిమాన హీరోలను ట్యాగ్ చేస్తూ, "మా హీరో కూడా ఇలాంటి ఫ్యాన్స్ మీట్ నిర్వహించాలి", "మాతో కూడా ఒక రోజు గడపాలి" అంటూ పోస్టులు చేస్తున్నారు. పలువురు సినీ అభిమానులు కూడా స్టార్ హీరోలు తరచూ అభిమానులతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే వారి మధ్య అనుబంధం మరింత బలపడుతుందని అభిప్రాయపడుతున్నారు. అల్లు అర్జున్ చేపట్టిన ఈ కార్యక్రమం తర్వాత సినీ వర్గాల్లో కూడా ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అభిమానులతో నేరుగా కలిసే అవకాశాలు పెరిగితే హీరోలకు మరింత సానుకూల ఇమేజ్ ఏర్పడుతుందని, సోషల్ మీడియాలోనూ మంచి స్పందన వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అభిమానుల అభిమానం కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, వ్యక్తిగత అనుబంధంగా మారేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అంటున్నారు. అల్లు అర్జున్ నిర్వహించిన ఈ ఫ్యాన్స్ మీట్ ఇప్పుడు టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్‌కు నాంది పలికిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# నవ్వుతో కట్టిపడేస్తున్న ప్రగ్యా జైశ్వాల్ నయా కాస్ట్యూమ్స్ చూశారా..?

కంచె, అఖండ, అఖండ 2, డాకు మహారాజ్ సినిమాలతో తెలుగులోమంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది ప్రగ్యా జైశ్వాల్. ఈ జబల్ పూర్ బ్యూటీ నెట్టింట యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్లలో జోష్ నింపుతుంటుంది. సోషల్ మీడియాలో తనకు సంబంధించిన అప్‌డేట్స్‌ను షేర్ చేసుకునే ప్రగ్యాజైశ్వాల్ తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలు కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రగ్యాజైశ్వాల్ సెలబ్రిటీ, ఫ్యాషన్ స్టైలిష్ట్ నటాషా బోత్రా అండ్ టీం డిజైన్ చేసిన ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో హొయలు పోయింది. బ్లూ అండ్ వైట్ చారలతో డిజైన్ చేసిన డ్రెస్‌లో చిరునవ్వులు చిందిస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'చారలు తిరిగి వచ్చాయని విన్నా..' అంటూ ఈ స్టిల్స్‌కు క్యాప్షన్ ఇచ్చింది. చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్టుగా ఉన్న ప్రగ్యాజైశ్వాల్ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న టైసన్ నాయుడులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది ప్రగ్యాజైశ్వాల్.

## తెలంగాణలో జనసేన బలోపేతమే

# ప్రధాన అజెండా...

### పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్

### పాలమూరు జనసేనలో నూతనోత్సాహం!




**మహబూబ్‌నగర్ ఆగస్టు 1(స్త్రైన్యూస్ ):**తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయి నుంచి తిరుగులేని రాజకీయ శక్తిగా బలోపేతం చేయడమే తమ ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ తాళ్లూరి రామ్ స్పష్టం చేశారు. జనసేన రాష్ట్ర నాయకులు, జిల్లా ఇన్‌చార్జ్ శ్రీ మేడ రామకృష్ణ నేతృత్వంలో మహబూబ్‌నగర్ జిల్లా, భూత్‌పూర్ రోడ్డులోని ఎస్.ఎన్. కన్వెన్షన్ హాల్‌లో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా తాళ్లూరి రామ్ మాట్లాడుతూ... పాలమూరు జిల్లాలో జనసేన జెండాను రెపరెపలాడిస్తూ, పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో మేడ రామకృష్ణ గారు వహిస్తున్న నాయకత్వ పాత్ర అత్యంత శ్లాఘనీయమని కొనియాడారు. రాత్రింబవళ్లు శ్రమిస్తూ కార్యకర్తలకు కొండంత అండగా నిలుస్తున్న రామకృష్ణ గారు జిల్లా పార్టీకి నిజమైన వెన్నుముక అని ప్రశంసించారు. 2014 పార్టీ ఆవిర్భావం నుండి సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ నేలపై జనసేన గొంతుక నిరంతరం బలంగా వినిపించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రచార కార్యదర్శి శ్రీ సాగర్ ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ... యువత బలంతో రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో జనసేన కీలక పాత్ర పోషించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు పాలమూరు నడిబొడ్డున ఉన్న అమరవీరుల స్థూపం నుండి సమావేశ ప్రాంగణం వరకు జనసైనికులు చేపట్టిన భారీ బైక్ ర్యాలీ నగరంలో పండగ వాతావరణాన్ని తలిపించింది. నేతలు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. ఈ ఆత్మీయ సమ్మేళనం వేదికగా మేడ రామకృష్ణ గారి దిశానిర్దేశంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రముఖ నాయకుడు శ్రీ జిల్లా జనార్ధన్ రెడ్డి సుమారు 250 మంది అనుచరులు, మద్దతుదారులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో దుంపటి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ఎం. దామోదర్ రెడ్డి, మేకల సతీష్ రెడ్డి, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, డాక్టర్ గడల శ్రీనివాస్, అల్లాడి తనీష్, చిరాగ్ ప్రజీత్ గౌడ్, మచ్చా సుధాకర్, తనుజా రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, ప్రేమ్ గాంధీ, సంతోష్ నాయక్, పాటు పెద్ద ఎత్తున జిల్లా నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

### గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో

## వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందించాలి

**దుమ్ముగూడెం ఆగస్టు 1(స్త్రై న్యూస్ ):**జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్ పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులు తదితర అంశాలను పరిశీలించారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో మాట్లాడి ఆరోగ్య సేవల నిర్వహణపై సమీక్షించారు. అలాగే ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందులు మరియు ఇతర ఆరోగ్య సదుపాయాలపై అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పలు ముఖ్యమైన సూచనలు చేశారు. ముఖ్య సూచనలువరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రసవానికి సమీపంగా ఉన్న గర్భిణీలను ముందుగానే గుర్తించి, సురక్షితమైన ప్రసవం కోసం డెలివరీ వెయిటింగ్ హాల్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెరిచిన ప్రతి ఇంజెక్షన్ వయల్‌పై ఓపెన్ చేసిన తేదీని తప్పనిసరిగా స్పష్టంగా నమోదు చేయాలని, సంబంధిత ప్రోటోకాల్‌ను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన అన్ని రికార్డులు, రిజిస్టర్లు మరియు





రిపోర్టులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పి హెచ్ సి పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు ఇతర అవసరమైన వర్గాలకు అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకొని పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలను ప్రతి మంగళవారం శుక్రవారం క్రమం తప్పకుండా, కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను గుర్తించి తొలగించడం ద్వారా డెంగ్యూ, మలేరియా ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వరద పరిస్థితుల నేపథ్యంలో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అత్యవసర మరియు సాధారణ వైద్య సేవలు ఎటువంటి అంతరాయం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని డా. తుకారామ్ రాథోడ్ సూచించారు. ముఖ్యంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, వ్యాధుల వ్యాప్తి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే అన్ని ఆరోగ్య కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్యం, మాతా-శిశు ఆరోగ్య సేవలు, వ్యాధి నిరోధక కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని వైద్యాధికారులకు సూచించారు.

# "కొంచెమైనా సిగ్గు మిగిలి ఉంటే- అమిత్ షాతో రాజీనామా చేయించండి"

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థులపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తూ, వారిని బలవంతంగా నిర్బంధిస్తూ, మోదీ సర్కార్ విద్యార్థులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దీనికి కారణమైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేత రాజీనామా చేయించాలని ఆయన ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. తమపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదనే నిబంధనపైనే యువత తమ ఆందోళనను విరమించుకున్నారని, కానీ ఇప్పుడు మోదీ సర్కార్ తన మాట తప్పిందని ఖర్గే విమర్శించారు.

జులై 20న క్రాంతి జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో విద్యార్థులు, నిరసనకారులు సంసద్ ఛలో మార్చ్ చేశారు. అప్పుడు నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చెలరేగింది. దీంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. బాష్పవాయువు ప్రయోగించారు. దీనితో ఇరువైపులా చాలా మందికి గాయాలయ్యాయి. దీనిని ఖర్గే ప్రస్తవిస్తూ, ఎక్స్ వేదికగా ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. "నరేంద్ర మోదీ, 10 రోజుల క్రితం మీ ప్రభుత్వం లాఠీలు, బెత్తాలు, పెల్లెట్ గన్?లను ఉపయోగించి యువతపై విరుచుకుపడింది. ఇప్పుడు విద్యార్థులు తమ నిరసనలు విరమించుకున్నారు. అయినా మీరు వారిపై ఎఫ్?ఐఆర్?లు నమోదు చేస్తూ, బలవంతంగా నిర్బంధిస్తూ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి తమపై ఎలాంటి చర్యలు తీసుకోరనే షరతుపైనే యువత ఉద్యమాన్ని విరమించారు. కానీ మీ ప్రభుత్వాలు ఇచ్చిన మాటను తప్పాయి. యువతకు చెందిన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేస్తున్నారు. యువతుల వ్యక్తిగత వివరాలను ఇంటర్నెట్?లో లీక్ చేస్తూ వేధిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి



అమిత్ షా కనీసం పార్లమెంట్?లో అడుగు పెట్టలేదు. జవాబుదారీతనం లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఇదంతా వారి అహంకారాన్ని సూచిస్తోంది. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, మీ ఇమేజ్?ను కాపాడుకోవడానికి చేసే ఇలాంటి తంత్రాలు ఇకపై సాగవు. యువత మీ నిజస్వరూపాన్ని చూశారు. కొంచెమైనా సిగ్గు మిగిలి ఉంటే, వెంటనే అమిత్? షా చేత రాజీనామా చేయించండి."

**మోదీ రీల్స్ చేయడంలో బీజీగా ఉన్నారు!**

మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్? ప్రధాని మోదీపై తనదైన రీతిలో సెటైర్లు వేశారు. "ఓ వైపు ప్రధాని మోదీ రీల్స్ చేయడంలో బిజీగా ఉంటే, మరోవైపు పేపర్ లీక్ అయ్యింది" అని ఎద్దేవా చేశారు.

"ప్రధాని మోదీ రీల్స్-మేకింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంలో నిరంతరం బిజీగా ఉన్నారు. మోదీ ప్రభుత్వం ఫాస్ట్? ట్రాక్ కోర్టులకు సంబంధించిన కండితుడుపు చట్టాన్ని పార్లమెంట్?లో ఆమోదించింది. ఈ తరుణంలోనే దేశంలో మరో పేపర్ లీక్ వార్త వెలుగులోకి వచ్చింది. ఈసారి మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వరాష్ట్రమైన ఒడిశాలో ఈ ఘటన జరిగింది. జులై 27న ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్?కి చెందిన పీజీ పరీక్ష జరుగుతుండగానే, దానికి సంబంధించిన ప్రశ్నాపత్రం వాట్సాప్?లో సర్క్యులేట్ అయినట్లు తేలింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ తన స్థిరమైన వైఖరిని స్పష్టం చేసింది. 2024లో అయినా లేదా ఇప్పుడు 2026లో అయినా కాంగ్రెస్ వాదన ఒక్కటే. కేవలం పేపర్ లీకేజీలకు కఠినమైన శిక్షలను చట్టబద్ధం చేయడం, కోర్టులను ఫాస్ట్? ట్రాక్? కోర్టులుగా ప్రకటించడం ఇక ఎంత మాత్రం సరిపోదు. మన విద్యావ్యవస్థలో పేరుకుపోయిన వ్యాపార ధోరణి, అవినీతిపై మనం మరింత విస్తృతమైన, నిజాయితీతో కూడిన చర్చ జరపాల్సిన అవసరం ఉంది. దేశంలో జరిగిన విద్యార్థి ఉద్యమం అసలు ఆశయం కూడా ఇదే. మోదీ ప్రభుత్వం ఈ ఆశయాన్ని కచ్చితంగా గౌరవించాలి" అని జైరాం రమేశ్ అన్నారు.

## పీవోకేలో పాకిస్థాన్ దమనకాండపై భారత్ సీరియస్

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పాక్ సాగిస్తున్న దారుణాలపై విదేశాంగ శాఖ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. పీవోకేలో జరుగుతున్న దారుణాలపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించి, పాకిస్థాన్‌ను జవాబుదారీ చేయాలని భారత్ డిమాండ్ చేసింది. పీవోకేలో శాంతియుతంగా జరుగుతున్న ఆందోళనలపై పాకిస్థాన్ ఉక్కుపాదం మోపుతోందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఆరోపించారు. పాక్ సైన్యం అణిచివేత చర్యల కారణంగా పీవోకేలో ఇప్పటికే 40మందికిపైగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, ఎంతోమంది తీవ్రంగా గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న పౌరులను పాక్ రక్షణ మంత్రి 'శత్రువులు'గా ముద్రవేయడం, అమాయక ప్రజలపై పాక్ యంత్రాంగానికి ఎంత చిన్నచూపు ఉందో బట్టబయలైందని రణధీర్ జైశ్వాల్ విమర్శించారు. పాకిస్థాన్ యంత్రాంగం ద్వారా శిక్షణ, నిధులు, ఆయుధాలు పొందిన ముజాహిద్దీన్లు ఇప్పుడు తమకే ఎదురుతిరుగుతున్నారని పాక్ ప్రధాని రాజకీయ వ్యవహారాల ప్రత్యేక సహాయకుడు అంగీకరించారని ఆయన చెప్పారు. "మీరు, మనమందరం చూసినట్లుగా పాకిస్థానీ ప్రభుత్వం పీఓకేలో శాంతియుత పౌరులపై క్రూరమైన బలప్రయోగాన్ని కొనసాగిస్తోంది. ఈ అణచివేత కారణంగా 40 మందికి పైగా అమాయక ప్రజలు మరణించారు. ఇంకా చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. నిరసన చేస్తున్న పౌరులను పాక్? రక్షణ మంత్రి శత్రువులుగా ముద్ర వేసినప్పుడు, పీఓకేలోని అమాయక ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న సంపూర్ణ ధిక్కారం బట్టబయలైంది." అని జైస్వాల్ అన్నారు.

పీఓకేలో నిర్వహిస్తున్న ఎన్నికలు పాకిస్థాన్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించడాన్ని ప్రతిబింబిస్తున్నాయని వీజూూ ప్రతినిధి రణ్?ధీర్ జైస్వాల్? అన్నారు. అణచివేతను ఎదుర్కొంటున్న వారు ఈ హింసపై స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కోరారని గుర్తు చేశారు. "అక్కడ నిర్వహించే ఎన్నికలు పాకిస్థాన్ ప్రభుత్వానికి అవమానకరమైన తిరస్కారంగా నిలుస్తున్నాయి. హింసాత్మక పాలనను ఎదుర్కొంటున్న ప్రజలు, అంతర్జాతీయ సంస్థలను విచారణ కోసం అభ్యర్థించారు. ఈ చట్టవిరుద్ధమైన హత్యలపై స్వతంత్ర దర్యాప్తు జరగాలి. పాకిస్థాన్ చర్యలను అంతర్జాతీయ సమాజం నిశితంగా పరిశీలించి, దాని దురాగతాలకు జవాబుదారీగా నిలబెట్టాలని మేము కోరాము." అని ఆయన అన్నారు.

పాకిస్థాన్ ప్రభుత్వం ప్రేరేపిత ఉగ్రవాదంపై అక్కడి ప్రధానమంత్రి రాజకీయ వ్యవహారాల ప్రత్యేక సహాయకుడు రాణా సనావుల్లా ఇటీవల చేసిన వ్యాఖ్యలపైనా రణ్?ధీర్? జైస్వాల్? స్పందించారు. భారత్‌ను దెబ్బతీసేందుకు పాక్ గతంలో ముజాహిదీన్లకు శిక్షణ ఇచ్చి, ఆయుధాలు సమకూర్చిందని జైస్వాల్ అన్నారు. వారే ఇప్పుడు తమ తుపాకులను సొంతం దేశంపై గురిపెట్టారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. హింస పేట్రేగిపోవడంతో అంతర్జాతీయ సంస్థలు స్వతంత్ర దర్యాప్తు చేయాలని అక్కడి ప్రజలే కోరుకుంటున్నారని చెప్పారు. "పాకిస్థాన్ ప్రభుత్వం శిక్షణ ఇచ్చి, నిధులు సమకూర్చి, ఆయుధాలు ఇచ్చి భారతదేశానికి పంపిన ముజాహిదీన్‌లే ఇప్పుడు తమ తుపాకులను దేశం వైపే తిప్పుకుని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారారు. ఈ విషయాన్ని పాక్? ప్రధానమంత్రి రాజకీయ వ్యవహారాల ప్రత్యేక సహాయకుడు బహిరంగంగానే అంగీకరించారు." అని వీజూూ ప్రతినిధి అన్నారు. అంతకుముందు జియో న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన సనావుల్లా, పీఓకేలోని నిరసనకారులు ఒకప్పుడు తాము ముజాహిదీన్‌లుగా శిక్షణ ఇచ్చిన వారేనని అన్నారు. వారిని పోరాడటానికి పంపామని, కానీ ఈ రోజు వారు మా మెడలకు చుట్టుకున్నారని అంగీకరించారు.

పాకిస్థాన్? ఆక్రమిత కశ్మీర్?లోని ప్రజలు విస్తృతమైన ఎన్నికల అవకతవకలపై ఫిర్యాదు చేస్తున్నారు. రిగ్గింగ్, రాజకీయ జోక్యం, ప్రజాస్వామ్య హక్కులను క్రమపద్ధతిలో అణచివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లో క్షీణిస్తున్న మానవ హక్కుల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ సమాజం తక్షణమే జోక్యం చేసుకోవాలని యునైటెడ్ కాశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ (ఖఖూచీూ) కూడా పిలుపునిచ్చింది. యూరోపియన్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్విట్జర్లాండ్, స్వీడన్, నార్వే, రష్యా, చైనా, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు, ప్రపంచ మీడియాకు ఖఖూచీూ విజ్ఞప్తి చేసింది. జీవన వ్యయాలు పెరగడం, పరిపాలనపరమైన సమస్యలు, మైనార్టీలపై రాజకీయ వివక్ష తదితర అంశాలకు నిరసనగా గత నెల నుంచి పీవోకేలో ఆందోళనలు మిన్నంటుతున్న సంగతి తెలిసిదే. ది జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) దీనికి నాయకత్వం వహిస్తోంది.

## ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తగ్గనున్న వర్షాలు



రైతులు పంటలు వేసే వేళ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం తన నెలవారీ అంచనాలు వెల్లడించింది. మలిదశ రుతుపవన వర్షాలు సాధారణంగా కంటే తక్కువగా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అంటే ఆగస్టు, సెప్టెంబర్? వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదువుతుందని అంచనా వేసింది. ఆగస్టు-సెప్టెంబర్ కాలంలో దేశవ్యాప్త వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్పీఏ)లో 94 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఒక నెల లేదా సీజన్‌లో నమోదైన వర్షపాతాన్ని, సాధారణంగా 30 నుంచి 50 సంవత్సరాల సుదీర్ఘ కాలానికి సగటుగా లెక్కించడాన్ని ఎల్‌పీఏ అంటారు. 1971 నుంచి 2020 వరకు చారిత్రక డేటా ప్రకారం, ఆగస్టు-సెప్టెంబర్ కాలానికి దేశవ్యాప్త సగటు వర్షపాతం (ఎల్?పీఏ) 422.8 మి.మీ.గా ఉంది.

**ప్రాంతాలవారీగా ప్రభావం ఎలా ఉంటుందంటే?**

వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర మాట్లాడుతూ, "ఆగస్టు-సెప్టెంబర్ కాలంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. అయితే దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, మధ్య భారతదేశం, వాయువ్య భారతదేశంలోని ఉత్తర ప్రాంతాలు, తూర్పు, ఈశాన్య భారతదేశాల్లో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంది" అని తెలిపారు.

అయితే, దేశవ్యాప్తంగా ఆగస్టు నెలలో కూడా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. 1971-2020 గణాంకాల ప్రకారం, ఆగస్టు నెలలో దేశంలో వర్షపాతం సూూూ 254.9 మి.మీ.గా ఉంది. ప్రస్తుతం, జూన్, జులై నెలల మధ్య కాలానికి సంబంధించి 13 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ నెలాఖరు నాటికి ఈ లోటు 35.4 శాతంగా ఉండేది. అయితే, జులైలో మంచి వర్షపాతం నమోదవ్వడం కారణంగా ఈ వర్షపాత లోటు తగ్గిందని డాక్టర్ మహాపాత్ర తెలిపారు. "జులై నెల సాధారణ సగటు వర్షపాతం 280.5 మి.మీ కాగా, ఈ ఏడాది దేశంలో 283.3 మి.మీ వర్షపాతం నమోదైంది. అయితే, దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. బంగాళాఖాతంలో నాలుగు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడ్డాయి. వాటిలో రెండు తీవ్రతరం చెంది వాయుగుండాలుగా మారాయి" అని ఆయన పేర్కొన్నారు. జులై మొదటి వారంలో గాలి, మేఘాల కదలికల వ్యవస్థ (వీజీూ) భారతదేశానికి అనుకూలమైన దశలో ఉండటం వల్ల దక్షిణ భారతం మీదుగా రుతుపవన మేఘాలు ఉత్తరం వైపు విస్తరించి భారీ వర్షాలు పడ్డాయి. అయితే జులై చివరి భాగంలో ఇది ప్రతికూలంగా మారింది. కాగా, భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత ఐదేళ్లలో అత్యధిక సంఖ్యలో 'అత్యంత భారీ వర్షపాత' సంఘటనలు (204.5 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం) కూడా ఈ జులైలోనే నమోదయ్యాయి. ఇవి ప్రధానంగా ఒడిశా, గుజరాత్, మహారాష్ట్రల్లో కేంద్రీకృతమై ఉన్నాయని డాక్టర్ మహాపాత్ర పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా చూస్తే ఈ ఏడాది జులైలో సాధారణం కంటే కొంచెం ఎక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో మాత్రం 1901 తర్వాత లోటు వర్షపాతం నమోదైంది.

**ఆ రాష్ట్రాల్లో భారీ వర్షాలు**

ఇదిలా ఉండగా, కేరళ, అసోం, అరుణాచల్ ప్రదేశ్, ఇతర ఈశాన్య రాష్ట్రాలతో సహా దేశంలోని పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములతో కూడిన వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137